
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

ఏలూరు

జిల్లా వార్తలు

3

సోమవారం 27 జనవరి 2025



'మా అక్షరం - మీ ఆయుధం'

నినాదంతో ప్రజల పక్షాన గొంతుకై అక్షర సమరం సాగిస్తోంది మీ అభిమాన పత్రిక ఆంధ్రజ్యోతి.

అభాగ్యులకు, అశక్తులకు అండగా నిలుస్తూ వారి సమస్యల పరిష్కారానికి దశాబ్దాలుగా అక్షర శరాలు సంధిస్తూ అలుపెరగని పోరాటం సాగిస్తోంది.

అవినీతి, అక్రమాలపై నిరంతరం యుద్ధం చేస్తూనే.. సమాజ ఉనికికే ప్రమాదకరంగా మారిన అరాచక శక్తులపై అక్షర కణాలతో కడిగేస్తూనే వుంది.

తాజాగా మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాం. మౌలిక సదుపాయాల కల్పన కోసం నిరీక్షించే ప్రజల గొంతుకై ప్రతిధ్వనించడానికి 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' మీ ముంగిటకు రానున్నాం.

సమస్యలను ఎత్తిచూపడంతోపాటు వాటి పరిష్కార దిశగా ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు అధికారులకు నడుమ వారధిగా నిలిచే మహత్తర కార్యక్రమానికి మంగళవారం నుంచి శ్రీకారం చుడుతున్నాం.

తాడేపల్లిగూడెం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఏపీ నిట్ వరకు వీధి దీపాలు లేవు. ఇదే ప్రాంతంలోని పార్కు నిర్వహణ సరిగా లేక నిరుపయోగంగా మారుతోంది. నూజివీడులో చాలా కాలంగా డ్రెయిన్లు పూడుకుపోవడంతో మురుగునీరు సరిగా పారడం లేదు.

ఈ సమస్యల పరిష్కారానికి మంగళవారం ప్రజా ప్రతినిధులు, అధికారులతో ఆయా ప్రాంతాల్లో చర్చా వేదికలు ఏర్పాటు చేస్తున్నాం. వీటిని వారి దృష్టికి తెచ్చేందుకు ఈ చర్చల్లో పాల్గొనాలని ఈ ప్రాంతాల ప్రజలను ఆహ్వానిస్తున్నాం.

సుపరిపాలన.. సంక్షేమం



జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ కేపీఎస్ కిశోర్, జేసీ ధాత్రిరెడ్డి, కైకలూరు ఎమ్మెల్యే కామినేని తదితరులు



వేడుకల్లో పాల్గొన్న జిల్లా అధికారులు

- పేదరిక నిర్మూలనే లక్ష్యం
- ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్ద పీట
- ధాన్యం కొనుగోళ్లలోను రైతుల పక్షమే
- వివిధ రకాల పంటలకు ప్రోత్సాహం
- రైతాంగానికి 4,435 కోట్ల పంట రుణాలు
- గృహ నిర్మాణంలోను ముందడుగు
- జిల్లాను పారిశ్రామికంగా తీర్చిదిద్దుతాం
- గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ వెట్రిసెల్వి

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : 'అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రజలందరికీ సంతృప్తికరంగా సంక్షేమ కార్యక్రమాల అమలు చేస్తూ సుపరిపాలనతో కూడిన సంక్షేమ పాలన అందిస్తున్నాం. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా కంకణం కట్టుకున్న ప్రభుత్వం మిగతా కార్యక్రమాల అమలు, శాఖల పురోగతి దిశగా పయనిస్తోంది' అని కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. 76వ భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఏలూరులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం జాతీయ పతాకాన్ని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'పేదరికంలేని సమాజం నిర్మించడం, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన, నీటి వనరుల పరిరక్షణ, రైతు-వ్యవసాయ టెక్నాలజీ, ప్రపంచ స్థాయి ఉత్తమ రవాణ సదుపాయాలు, విద్యుత్ రంగంలో ధరల నియంత్రణతోపాటు పది సూత్రాలతో స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలను సాధించే దిశగా యంత్రాంగం కృషి చేస్తోంది. జిల్లాలో వ్యవసాయంతో పాటు పారిశ్రామిక అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం, వ్యవసాయ రంగంలో 15 శాతం, పారిశ్రామిక వృద్ధిలో 20 శాతం వృద్ధి రేటు సాధించే దిశగా ప్రణాళిక రూపొందించాం. వ్యవసాయంతో పాటు సాగునీటి పారుదల ప్రాజెక్టులకు ప్రాధాన్యత కల్పిస్తున్నాం. పోలవరం ప్రాజెక్టు డయాఫ్రం వాల్ పనులు ప్రారంభమయ్యాయి. నిర్వాసితులందరికీ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలు చేయడమే కాకుండా ఇటీవల రూ.789 కోట్లు నిర్వాసితుల ఖాతాలకు ప్రభుత్వం జమ చేసింది. ఓఅండ్ఎం యాక్షన్ ప్లాను కింద ఆరు కోట్లతో కాల్వలు, డ్రెయిన్లలో పూడిక తొలగింపునకు సన్నాహాలు చేస్తున్నా'మంటూ పేర్కొన్నారు. ఆమె ఇంకేమన్నారంటే..

వ్యవసాయం, ఆక్వాకు ప్రాధాన్యం..

వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇస్తూ ఈ ఆర్థిక సంవత్సరంలో రైతాంగానికి రూ.4,435 కోట్లు పంట రుణాలుగా అందించాం. కౌలు రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ వారికి సాగుదారుల హక్కు పత్రాలు జారీ లక్ష్యంగా ఇంతవరకు 65,147 మంది రైతులకు జారీ చేశాం. ఖరీఫ్‌లో జిల్లాలో 3 లక్షల 32 వేల 337 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి 765 కోట్ల 35 లక్షల రూపాయలను 24 గంటల్లో రైతుల ఖాతాల్లో జమ చేశాం. ఉద్యాన రైతులను ప్రోత్సహిస్తున్నట్టు బిందు తుంపర సేద్యాన్ని కూడా ముందు వరుసలో నిలిపే ప్రయత్నం చేస్తున్నాం. నూజివీడు మామిడికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది. దీని ఇమేజ్ పెంచేలా రూ.30 కోట్లతో నూజివీడు మార్కెట్‌ను అభివృద్ధి చేస్తున్నాం. ఉద్యాన, ఆక్వా రంగంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ప్రోత్సహిస్తున్నాం. సుమారు 12 లక్షల టన్నుల ఆక్వా ఉత్పత్తుల ఉత్పాదన చేస్తూ జిల్లా దేశంలోనే తొలి వరుసలో నిలిచింది.

అభివృద్ధికి పెద్ద పీట

జిల్లాలో వ్యవ సాయంతోపాటు అనేక వినూత్న కార్యక్రమాలను రూపొందించి అమలు చేయబోతున్నాం. ఈ ఆర్థిక సంవత్సరంలో 115 కోట్లతో 3372 పరిశ్రమలు మంజూరు చేశాం. పరిశ్రమల అభివృద్ధికి 1600 ఎకరాలను గుర్తించాం. ద్వారకాతిరుమలలో పైలెట్ ప్రాజెక్టుగా 750 కిలో వాట్ల సామర్థ్యం గల సోలార్ పార్కు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించాం. వ్యవసాయ విద్యుత్ ఫీడర్ల సోలరైజేషన్ కార్యక్రమంలో భాగంగా 471 ఎకరాల్లో 105 మెగావాట్ల సామర్థ్యం గల సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన కింద జిల్లాలో 537 మంది గృహ వినియోగదారులు సోలార్ విద్యుత్ ఫలకాలను ఏర్పాటు చేసుకున్నారు. ద్వారకాతిరుమల, దుగ్గిరాల, చిననింద్రకొలను, తడికలపూడి, యర్రంపేట గ్రామాలను మోడల్ సోలార్ గ్రామాలుగా తీర్చిదిద్దుతున్నాం.

పాలనలో వేగంగా..

జిల్లాలో వివిధ కార్యక్రమాల అమలులో వేగంగా ముందుకువెళ్ళే ప్రయత్నం చేస్తున్నాం. మెగా డీఎస్సీ ద్వారా 1035 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయడమే కాకుండా లక్షా 15 వేల 132 మంది విద్యార్థులకు 44 కోట్ల 36 లక్షలతో మధ్యాహ్న బడి భోజన పథకం అమలు చేస్తున్నాం. ఎన్టీఆర్ గృహ నిర్మాణంలో 1868 కోట్ల రూపాయలతో లక్షా 3 వేల 808 గృహాలు నిర్మిస్తున్నాం. 29 వేల 156 స్వయం సహాయక సంఘాలకు 1828 కోట్ల రూపాయలు రుణంగా అందిస్తున్నాం. రైతు కూలీల వలసలు నివారించేందుకు 260 కోట్ల 36 లక్షల రూపాయలను జాతీయ ఉపాధి హామీ పథకం కింద కూలీలకు చెల్లించాం. గుంతలులేని రహదారుల కోసం 682 కిలోమీటర్ల రహదారులను 98 కోట్ల రూపాయలతో మరమ్మతు చేపట్టి మార్చి నెలాఖరులోపు శాశ్వత నిర్మాణ పనులు పూర్తి చేస్తాం. ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్ట్ కార్యక్రమంలో ప్రతీ మండలం నుంచి ఒక గ్రామాన్ని పైలెట్ గ్రామంగా ఎంపిక చేసి రీసర్వే చేపడుతున్నామంటూ వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్పీ కిశోర్, జేసీ ధాత్రిరెడ్డి, ఏఎస్పీ సూర్యచంద్రరావు, కైకలూరు, దెందులూరు, ఉంగుటూరు ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, చింతమనేని ప్రభాకర్, పత్సమట్ల ధర్మరాజు, డీఎఫ్‌వో శుభకరణ్, నూజివీడు సబ్‌కలెక్టర్ స్మరణ్‌రాజ్, డీఆర్వో విశ్వేశ్వరరావు, ఆర్డీవో అచ్యుత అంబరీష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల గౌరవ వందనం

ఏలూరు క్రైం : భారత గణతంత్ర వేడుకల్లో భాగంగా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం పోలీసుశాఖకు చెందిన ఏడు విభాగాల కంటింజెంట్‌లు కార్యక్రమ ముఖ్య అతిథి, కలెక్టర్ వెట్రిసెల్వికు పరేడ్ కమాండర్ ఆర్మ్‌డ్ రిజర్వు పోలీస్ రిజర్వు ఇన్‌స్పెక్టర్ జీఎస్‌పీ పవన్‌కుమార్ సారథ్యంలో గౌరవ వందనం అందించారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్‌కు కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ కేపీఎస్ కిశోర్ మెమెంటో అందజేశారు.





వ్యవసాయశాఖ శకటం

ఆకట్టుకున్న ప్రగతి శకటాల ప్రదర్శన

ఏలూరు రూరల్ : గణతంత్రదినోత్సవ వేడుకల సందర్భంగా పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో వివిధ ప్రభుత్వ శాఖల ప్రదర్శించిన శకటాల ప్రదర్శనలు ఆకట్టుకు న్నాయి. రైతు సంక్షేమంపై వ్యవసాయశాఖ రూపొందించిన శకటానికి, విద్యా ప్రాధాన్యతను తెలియచేస్తూ విద్యాశాఖ రూపొందించిన శకటాలకు ప్రథమ బహుమతి, విద్యుత్ పంపిణీ శకటానికి ద్వితీయ, పోలవరం ప్రాజెక్టు నమూనాతో రూపొందించిన ఇరిగేషన్‌శాఖ శకటం, పౌరసరఫరాల శాఖల శకటానికి తృతీయ బహుమతులు లభించాయి.



విద్యాశాఖ శకటం

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

పరేడ్‌గ్రౌండ్స్‌లో విద్యార్థులు దేశభక్తిని ప్రబోధించే ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వీటిలో ఏలూరు కస్తూరిబా బాలికోన్నత పాఠశాల ప్రదర్శనకు ప్రథమ, తెల్లంవారిగూడెం గిరిజన పాఠశాల విద్యార్థుల ప్రదర్శనకు, సెయింట్‌థెరిస్సా విద్యార్థుల ప్రదర్శనకు ద్వితీయ, కలిదిండి ఇంగ్లీష్ మీడియం విద్యార్థుల ప్రదర్శనకు, ఏలూరు అక్షర పాఠశాల విద్యార్థుల ప్రదర్శనకు తృతీయ బహుమతి లభించింది. సి.ఆర్.రెడ్డి పబ్లిక్‌స్కూల్ విద్యార్థులకు కన్సొలేషన్ బహుమతులు లభించాయి.



ఏలూరు కస్తూరిబా బాలికోన్నత పాఠశాల విద్యార్థినుల ప్రదర్శన

ఉత్తమ అవార్డులు స్వీకరించిన అధికారులు



కలెక్టర్, జేసీ చేతుల మీదుగా ప్రశంసా పత్రం స్వీకరిస్తున్న డీఆర్వో విశ్వేశ్వరరావు



ఎం.అచ్యుత్ అంబరీష్, ఏలూరు ఆర్డీవో



వి.శ్రీరామ్‌బాబు, రీజినల్ ఎన్‌ఫోర్సుమెంట్ ఆఫీసర్



హబీబ్ బాషా, జిల్లా వ్యవసాయాధికారి



పి.సాల్మన్ రాజు, ఎస్ఈ, ఏపీఈపీడీసీఎల్



వి.శ్రీలక్ష్మి పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్



కె.ఎస్ఎస్ సుబ్బారావు, జడ్పీ సీఈవో



ఎల్.దేవికాదేవి, ఎస్డీసీ (విజిలెన్స్ సీఎస్)



కేవీ సుబ్బారావు, ప్రాజెక్టు డైరెక్టర్ డ్వామా



డి.నీలాద్రి లీడ్ బ్యాంక్ మేనేజర్



ఎస్.రామ్మోహన్ జిల్లా ఉద్యాన శాఖాధికారి



జి.సత్యనారాయణ డిస్ట్రిక్ హెడ్ హౌసింగ్



ఎంవీ రమణ మూర్తి ఈఈ పంచాయతీరాజ్

ఏలూరు సిటీ : 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో మెరుగైన పనితీరు కనబరిచిన 400 మంది అధికారులు, పోలీస్, వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బందికి పరేడ్ గ్రౌండ్స్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ వెట్రిసెల్వి ప్రశంసా పత్రాలను అందజేశారు. వీరిలో జిల్లా అధికారులు 13 మంది ఉన్నారు. అలాగే అయా శాఖల నుంచి ప్రతిభా అవార్డులు అందుకున్న వారి సంఖ్య వివరాలివి.. కలెక్టరేట్ రెవెన్యూ 16, రెవెన్యూ ఏలూరు డివిజన్ 20, జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజన్ 12, నూజివీడు రెవెన్యూ డివిజన్ 16, పోలీస్ సిబ్బంది 52, ఏపీఎంఐపీ శాఖ 3, జిల్లా వ్యవసాయ శాఖ 20, పశుసంవర్ధక శాఖ 4 , ఆర్టీసీ 4 , అయుష్ శాఖ 4 , బ్యాంకింగ్ సెక్టార్ నుంచి 3, బీసీ వెల్ఫేర్ 2, డీఎస్‌వో కార్యాలయం 4, కమర్షియల్ శాఖ 4, డీసీహెచ్ఎస్ 4, జిల్లా పౌరసరఫరాల సంస్థ 5, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ 1, డీఆర్‌డీఏ 7, డ్వామా శాఖ 4, దేవదాయ శాఖ 2, ఫ్యాక్టరీస్ 1, అగ్ని మాపక శాఖ 5, ఫిషరీస్ 1, అటవీశాఖ 5, ఉద్యానశాఖ 4, హౌసింగ్ 5, ఐఅండ్‌పీఆర్ 3, పరిశ్రమల శాఖ 2, కార్మిక శాఖ 2, మెడికల్ అండ్ హెల్త్ 5, ఏలూరు మునిసిపల్ కార్పొరేషన్ 5, ఎస్‌ఐసీ 2, పంచాయతీరాజ్‌కు 6, పేఅండ్ అకౌంట్స్ 3, సీపీవో 3, జైళ్ల శాఖ 2, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ శాఖ 3, పబ్లిక్ లైబ్రరీస్ 3, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ 4, స్టేట్ ఆడిట్ శాఖకు సంబంధించి 2, రవాణా శాఖ 4, ట్రెజరీ అండ్ అకౌంట్స్ 5, గిరిజన సంక్షేమశాఖ 2, వాటర్ రీసోర్స్ 7, విభిన్నప్రతిభావంతుల శాఖ 2, మెప్మా 3, కళాశాల విద్య 2, ఇంటర్మీడియేట్‌కు సంబంధించి 2, మార్కెటింగ్ శాఖ 5, సర్వే అండ్ ల్యాండ్స్ 5, స్త్రీశిశుసంక్షేమశాఖ 5, ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి 5, సహకార శాఖ 5, ఏపీఈపీడీసీఎల్ 8, ఆర్‌డబ్ల్యూఎస్ 5, సోషల్‌వెల్ఫేర్ 5, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ 10, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ముగ్గురు, విజిలెన్స్ అండ్‌ఎన్‌ఫోర్స్‌మెంట్ 6, స్కూల్ ఎడ్యుకేషన్ 11, యుడాకు 4, జిల్లా ప్రజా పరిషత్ 14, ఎన్‌జీవోలు 11 మందికి అవార్డులు అందజేశారు. అలాగే రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా నిలిచిన ఉంగుటూరు ఎంపీపీ పాఠశాల ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం ఎస్.పెద్దిరాజు, ఏలూరుకు చెందిన సోషల్ స్టడీస్ ఉపాధ్యాయుడు జి.కృష్ణ, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు కె.జాన్‌లను సత్కరించి రూ.20 వేల చొప్పున నగదు పురస్కారాన్ని కలెక్టర్ అందజేశారు.



కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్న రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు.. ఎస్.పెద్దిరాజు,కె.జాన్, గగ్గులోతు కృష్ణ



గుబ్బల మంగమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

బుట్టాయగూడెం, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ అటవీ ప్రాంతంలోని గుబ్బల మంగమ్మను దర్శించుకోవడానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. జిల్లా నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు.

భీమవరంలో 'సంక్రాంతికి వస్తున్నాం' విజయోత్సవం



గోదారోళ్ళ అప్యాయతలు.. వారి కలష్మం లేని నవ్వులు ఎన్నటిక మరవలేను.. 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాను ఇంత పెద్ద హిట్ ఇస్తారని అనుకోలేదంటూ విక్టరీ వెంకటేశ్ ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం సాయంత్రం 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్ర విజయోత్సవ సభ జరిగింది. వెంకటేశ్, హీరోయిన్స్ ఐశ్వర్య రాజేశ్, మీనాక్షి చౌదరి, డైరెక్టర్ అనిల్ రావిపూడి, చిత్ర బృందం పాల్గొన్నారు. గోదారి గట్టు.. పాటకు డాన్స్ వేయడంతో పాటు 'బేసికల్లీ' సాంగ్‌ను హీరో వెంకటేశ్ పాడి అలరించారు. -4లో


ఏలూరులో విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన


సీఆర్ రెడ్డి పాఠశాల విద్యార్థుల విన్యాసం

గణతంత్ర వేడుక సాంస్కృతిక సందడి

ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్, భీమవరం కలెక్టరేట్ ఆవరణలో ఆదివారం జరిగిన గణతంత్ర వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థిని, విద్యార్థుల నృత్య, నాటక ప్రదర్శనలు, జాతీయ స్ఫూర్తి, క్రీడా స్ఫూర్తి నింపే విన్యాసాలు, ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.




ఏలూరులో సెయింట్ థెరిసా కళాశాల విద్యార్థినుల ప్రదర్శన


భీమవరంలో గణతంత్ర వేడుకల్లో విద్యార్థుల పల్లె నృత్యం




ఏలూరు విద్యార్థుల రోప్ స్కిప్పింగ్ విన్యాసం


గణతంత్ర వేడుకల్లో ఆకట్టుకున్న కలిదిండి విద్యార్థుల విన్యాసం




తణుకు జడ్పీ బాలుర పాఠశాల విద్యార్థినుల నృత్య ప్రదర్శన




మహిళలపై వేధింపులు అంశంపై ఏలూరు కస్తూరిబా పాఠశాల విద్యార్థుల ప్రదర్శన



శకట విజయం


ఏలూరు జిల్లాలో ద్వితీయ బహుమతి పొందిన విద్యుత్ శాఖ, తృతీయ బహుమతి పొందిన ఇరిగేషన్, పౌర సరఫరాల శాఖ శకటాలు




పశ్చిమగోదావరి జిల్లాలో ద్వితీయ బహుమతి పొందిన వ్యవసాయ శాఖ, తృతీయ బహుమతి పొందిన పశు సంవర్ధక శాఖ శకటాలు

సాంస్కృతిక విజయం




ఏలూరు జిల్లాలో ద్వితీయ బహుమతి పొందిన గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల, సెయింట్ థెరిసా మహిళా కళాశాల విద్యార్థినుల ప్రదర్శనలు




పశ్చిమ గోదావరి జిల్లాలో ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన పాలకొల్లు విద్యా భవన్, భీమవరం పీఎస్ఎం పాఠశాల విద్యార్థుల ప్రదర్శనలు

రాజ్యాంగం ద్వారానే సమాన హక్కు: ఐజీ అశోక్‌కుమార్








జిల్లా కోర్టు ఆవరణ, నిట్, ఉద్యాన యూనివర్సిటీ ఆవరణలో జాతీయ జెండా ఆవిష్కరణ, జెండా వందనం చేస్తున్న ఐజీ అశోక్ కుమార్


డీసీసీబీ ఆవరణలో జాతీయ పతాకానికి వందనం

ఏలూరు క్రైం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం ద్వారా అందరికీ సమాన హక్కు సంక్రమించిందని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. రేంజ్ కార్యాలయం వద్ద ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ ఆదివారం త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి జెండావందనం చేశారు. రాజ్యాంగానికి అనుగుణంగా ఉద్యోగ నిర్వహణ, ప్రజలకు మరింత మెరుగైన సేవలందించడానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టు ఆవరణలో..

ఏలూరు జిల్లా కోర్టుపై జాతీయ పతాకాన్ని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి ఎం.సునీల్‌కుమార్ ఆవిష్కరించారు. డాక్టర్ డీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని అమలు చేయడంలో న్యాయవాదులు విశేష కృషి చేయాలని, తద్వారా సమాజ అభివృద్ధి వైపు పయనిస్తుందన్నారు. న్యాయాధికారులు పి.మంగాకుమారి, జి.రాజేశ్వరి, ఎం.ఉమా సునంద, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఏపీ నిట్ ఆవరణలో..

తాడేపల్లిగూడెం అర్బన్: భిన్నత్వంలో ఏకత్వం భారత దేశ గొప్పతనమని ఏపీ నిట్ రిజిస్ట్రార్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిట్ ప్రాంగణంలో జాతీయ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ హిమబిందు, డాక్టర్ కార్తిక్ శేషాద్రి, డాక్టర్ వీరేష్‌కుమార్ పాల్గొన్నారు.

డీసీసీబీ కార్యాలయం వద్ద..

ఏలూరు: ఉమ్మడి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు కార్యాలయం వద్ద డీసీసీబీ సీఈవో నారా ఎంఎస్ఆర్‌జి తిలక్ జాతీయ జెండా ఆవిష్కరించారు. సిబ్బంది స్వీట్లు పంచిపెట్టారు. జీఎం మాధవి, డీజీఎం డీఎన్‌వి సత్యనారాయణ, ఏజీఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

జడ్పీ కార్యాలయంలో..

ఏలూరు సిటీ: జిల్లా పరిషత్ కార్యాలయంలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యాలయ ఆవరణలో జాతీయ పతాకాన్ని జడ్పీ సీఈవో కేఎస్ఎస్.సుబ్బారావు ఎగురవేశారు. కార్యాలయ ఏవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యాన విశ్వవిద్యాలయంలో..

తాడేపల్లిగూడెం రూరల్: వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం వద్ద గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉప కులపతి డాక్టర్ కె.గోపాల్ జాతీయ జెండా ఆవిష్కరించారు. మాండ్లెజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేటు లిమిటెడ్ సౌజన్యంతో ప్రతిభ కనబరిచిన 18 మంది విద్యార్థులకు రూ.13 లక్షల చెక్‌ను వీసీ గోపాల్ విద్యార్థులకు అందించారు. రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, ఉద్యాన ఉన్నతాధికారులు ఎల్ నారం నాయుడు, ఎం మాధవి, తదితరులు పాల్గొన్నారు.


ఆంధ్రజ్యోతి కార్యాలయం వద్ద జాతీయ జెండా ఆవిష్కరించిన బీఎం హరిబాబు

ఆంధ్రజ్యోతి కార్యాలయంలో గణతంత్ర వేడుకలు

పెంటపాడు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): అలంపురంలోని ఆంధ్రజ్యోతి ఉమ్మడి జిల్లా కార్యాలయం వద్ద గణతంత్ర వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. బ్రాంచి మేనేజర్ బి.హరిబాబు జాతీయ పతాకం ఆవిష్కరించారు. కార్యాలయ సిబ్బందికి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో వివిధ విభాగాల ఇన్‌చార్జిలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో సంక్రాంతి సందడి


సంక్రాంతికి వస్తున్నాం సక్సెస్ మీట్‌లో హీరో వెంకటేష్, హీరోయిన్లు ఐశ్వర్య, మీనాక్షి సందడి

గోదారోళ్ల అప్యాయత మరువలేనిది

- సక్సెస్ మీట్‌లో హీరో వెంకటేష్

భీమవరం అర్బన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గోదారోళ్ల అప్యాయత, కల్మషం లేని నవ్వు ఎన్నటికి మరవలేను.. సంక్రాంతికి వస్తున్నాం ఇంత పెద్ద హిట్ ఇస్తారని అసులు అనుకోలేదని హీరో వెంకటేష్ అన్నారు. ప్రేక్షకులు చిన్న హగ్ ఇస్తారనుకుంటే గాఢంగా గుండెలకు హత్తుకున్నారని కృతజ్ఞతలు తెలిపారు. సంక్రాంతికి వస్తున్నాం సినిమా విజయవంతం కావడంతో భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం వేడుక నిర్వహించారు. సినిమా చూసిన ఎవరైనా సరే తమ ఎక్స్ గర్ల్‌ఫ్రెండ్ గురించి భార్యకు చెప్పడానికి భయపడతారని వెంటేష్ అన్నారు. హీరోయిన్లు ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి యువతను ఉత్సాహపరిచారు. హలో భీమవరం ఐ లవ్ యూ... స్టుడెంట్స్‌ను చూస్తుంటే తమ కాలేజీ డేస్ గుర్తుకు వస్తున్నాయన్నారు. అనంతరం వెంకటేష్ గోదారి గట్టు పాటకు డాన్స్ చేశారు. బేసికల్ పాట పాడి అందరిని అలరించారు. సినిమా డైరెక్టర్ అనిల్ రావిపూడి మాట్లాడుతూ ఇంత పెద్ద హిట్ ఇచ్చిన ప్రేక్షకులను జీవితాంత రుణపడి ఉంటాను అంటు బుల్లిరాజుతో డైలాగ్ చెప్పించి అందరిని నవ్వించారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యే అంజిబాబు, మంతెనరామరాజు, తదితరులు మాట్లాడారు. యంకర్‌లుగా రవి, గీత, సింగర్స్ శ్రీకృష్ణ, రఘురామ్, మధుప్రియ పాటలతో అలరించారు.


వేదికపై వెంకటేష్, అనిల్ రావిపూడి, బుల్లిరాజు సందడి


పాట పాడి ఉత్సాహపరిచిన హీరో వెంకటేష్, హీరోయిన్లు


జెస్సిరాజ్‌ను అభినందిస్తున్న గవర్నర్ నజీర్

జెస్సిరాజ్‌కు గవర్నర్ ప్రశంస

దెందులూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): స్కేటింగ్‌లో అంతర్జాతీయ పతకాలు సాధించి ప్రధాని మోదీ, రాష్ట్రపతి ముర్ము నుంచి ప్రధానమంత్రి బాల పురస్కారం అందుకున్న జోగన్నపాలెం గ్రామానికి చెందిన మాత్రపు జెస్సిరాజ్‌ను గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ సత్కరించారు. విజయవాడలో ఆదివారం జరిగిన గణతంత్ర వేడుకల్లో గవర్నర్ జెస్సిరాజ్‌కు ప్రశంసా పత్రం అందజేశారు. ప్రపంచ ఓషియాన పసిఫిక్ కప్ చాంపియన్ షిప్ -2024లో బంగారు పతకం సాధించిన జెస్సీ ప్రధానమంత్రి రాష్ట్రీయబాల పురస్కార్ అందుకుంది.

మావుళ్లమ్మ ఆలయానికి
పది గ్రాముల బంగారం అందజేత



మావుళ్లమ్మ ఆలయానికి బంగారం అందిస్తున్న దృశ్యం

భీమవరం టౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మావుళ్లమ్మ అమ్మవారి ఆలయానికి భీమవరానికి చెందిన కలిదిండి వెంకట దిలీప్ కుమార్ వర్మ 10 గ్రాముల బంగారం విరాళంగా అందించారు. దాతలు అమ్మవారిని దర్శించుకోగా ఆలయ అర్చకులు మద్దిరాల రమణ శర్మ వీరికి పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందించారు. దేవస్థానం తరుపున ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ శేషవస్త్రం ప్రసాదాలు, అమ్మవారి చిత్ర పటాన్ని అందించారు.

హీరోయిన్ ఐశ్వర్య రాజేశ్ పూజలు



ఐశ్వర్య రాజేశ్‌కు ప్రసాదం, చిత్రపటాన్ని అందిస్తున్న ఈఓ

భీమవరం టౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మావుళ్లమ్మ అమ్మవారిని 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్ర హీరోయిన్ ఐశ్వర్యరాజేశ్ ఆదివారంనాడు దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆమె అమ్మవారిని దర్శించుకోగా ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందించారు. దేవస్థానం తరుపున ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ శేషవస్త్రం ప్రసాదాలు, అమ్మవారి చిత్రపటాన్ని అందించారు.



ఖజానా ఉద్యోగుల సంఘ కార్యవర్గం

ఏలూరు రూరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి):ఖజానాశాఖ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషిచేస్తానని ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన యు.వి పాండురంగారావు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం ఏలూరు ఖజానాశాఖ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఇటీవల ఈ అసోసియేషన్‌కు సంబంధించి కార్యవర్గం ఏర్పాటుకు ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎన్నికల అధికారి విడుదల చేశారు. ఆదివారం మధ్యాహ్నం నామినేషన్ దాఖలు, విత్‌డ్రా కార్యక్రమం జరిగింది. ఆయా పదవులకు సంబంధించి ఒక్కో నామినేషన్ దాఖలు కావడంతో సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాసరావు ప్రకటించారు. అధ్యక్షుడిగా యు.వి పాండురంగారావు, అసోసియేట్ అధ్యక్షుడిగా మధుసూధన్‌రావు, మహిళా ఉపాధ్యక్షురాలిగా రమాకిరణ్మయ్, ఉపాధ్యక్షులుగా హరిబాబు, ఏ.శ్రీనివాసరావు, రాజేష్‌కుమార్, కార్యదర్శిగా కె.సత్యనారాయణ, మహిళా విభాగం జాయింట్ కార్యదర్శిగా వరలక్ష్మి, నరసింహారావు, విద్యాసాగర్, ట్రెజరర్‌గా ఎల్.వెంకటేష్ ఎన్నిక అయ్యారు. ఈ సందర్భంగా నియామకపత్రాలను అందజేశారు. నూతన కార్యవర్గ సభ్యుడు ప్రమాణస్వీకారం చేశారు. కార్యవర్గాన్ని ట్రెజరీ ఉద్యోగులు అభినందించారు. నూతన అధ్యక్షుడు పాండురంగారావు మాట్లాడుతూ ఖజానాశాఖలో సిఎఫ్ఎమ్ఎస్‌కు సంబంధించి, ఇతర సమస్యలు ఉన్నాయన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. ఎన్నికల పరిశీలకులుగా రమణారెడ్డి, బి.సతీష్ వ్యవహరించారు. జేఏసీ అసిస్టెంట్ కార్యదర్శి జనరల్ ఆర్.ఎస్ హరినాథ్,ఎన్జీవోస్ అసోసియేషన్ కార్యదర్శి ఎన్.వి రామారావు నూతన కార్యవర్గ సభ్యులను అభినందించారు.

డ్రాయింగ్, పెయింటింగ్‌లో నాగలక్ష్మికి రాష్ట్రస్థాయి బహుమతి



సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు చేతులు మీదుగా సర్టిఫికెట్, బహుమతి తీసుకున్న కలవల కుసుమ

ఆకివీడు రూరల్ జనవరి 26 (ఆంధ్రజ్యోతి): సిద్దాపురం దామోదరం సంజీవయ్య జడ్పీపాఠశాల విద్యార్థిని కలవల కుసుమ నాగలక్ష్మి డ్రాయింగ్ అండ్ పెయింటింగ్ విభాగంలో రాష్ట్రస్థాయి విజేతగా నిలిచింది. విజయవాడ పడమటలోని సమగ్ర శిక్ష కార్యాలయంలో ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు చేతులు మీదుగా ప్రశంసాపత్రం, షీల్డ్, రూ. 5వేల నగదు అందుకున్నది. విద్యాశాఖ ని ర్వహించిన వీరగాథ కార్యక్ర మంలో భాగంగా తాను వేసి న డ్రాయింగ్ అండ్ పెయింటింగ్‌లను తన పాఠశాల నుంచి ఉపాధ్యాయురాలు వీరగాథ యాప్‌లో సబ్‌మిట్ చేశారని 8వ తరగతి చదువుతున్న కుసుమ తెలిపింది. తనకు చిన్న పృటినుంచి డ్రాయింగ్ పెయి ంటింగ్ పట్ల ఆసక్తితో ఖాళీ సమయాలలో బొమ్మలు వేస్తానని తెలిపింది. తన తల్లిదండ్రులతో కలిసి ఈ బహుమతి తీసుకోవడం ఆనందంగా ఉందని తెలిపింది. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు అభినందనలు తెలిపారు.

ఇద్దరూ హెల్మెట్ ధరించాల్సిందే



హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న టూటౌన్ సీఐ వైవి రమణ, ఎస్‌ఐలు రామకృష్ణ, నాగ కల్యాణి

ఏలూరు క్రైం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ప్రాణం ఎంతో విలువైందని వాహనాలు నడిపేటప్పుడు ప్రాణ రక్షణకోసం హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఏలూరు టూటౌన్ సీఐ వైవీ రమణ అన్నారు. ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియం దగ్గర పలువురు ద్విచక్ర వాహనదారులకు ఆదివారం రాత్రి హెల్మెట్ ధారణపై అవగాహనను సీఐ రమణ, ఎస్‌ఐలు రామకృష్ణ, నాగ కల్యాణి కల్పించారు. ఈ సందర్భంగా సీఐ రమణ మాట్లాడుతూ ఎక్కువ మంది ద్విచక్ర వాహనదారులు రోడ్డు ప్రమాదంలో తలకు దెబ్బతగలడం వల్లే మృతి చెందుతున్నారని వారి కుటుంబాలు ఎంతో ఆవేదనకు గురై చిన్నా భిన్నంగా మారుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరు ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించుకోవాలని, ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు తలకు దెబ్బతగలదని ప్రాణాలు కాపాడుకోవచ్చునని అన్నారు. మోటారు వాహన చట్టంపై అవగాహన కలిగిస్తూ నడిపే వారితో పాటు వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాని సూచించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మొగల్తూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు బీఆర్ఎంవీ హైస్కూల్‌లో 1981లో పదవ తరగతి చదివిన విద్యార్థుల బృందం ఆదివారం ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ ఆలయం వద్ద సమావేశమయ్యారు. ఈ బ్యాచ్ కుటుంబ సమేతంగా పాల్గొని ఒకరి నొకరు మంచి చెడులు తెలుసుకున్నారు. కరోనా సమయంలో ఈ బ్యాచ్ ద్వారా చేసిన కార్యక్రమాలను చర్చించుకుని భవిష్యత్‌లో చేపట్టే కార్యక్రమాలను తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ఆబ్యాచ్ సంఘ అధ్యక్షుడు గణేష్, కార్యదర్శి కె.వి సాంబశివరావు, ఏలూరు డీఈ తోట వెంకట నారాయణ, సంఘ ప్రతినిధులు శ్రీనివాస్, పెన్మత్స శ్రీనివాసరాజులతో పాటు సుమారు 100 మంది ఆబ్యాచ్ పూర్వ విద్యార్థులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

సైబర్ టార్చర్..



» క్రెడిట్ కార్డ్ అంటూ వివరాలు సేకరిస్తారు » మీ పేరుతో రుణం ఇచ్చామంటూ బెదిరింపులు » ఫోన్ కట్‌చేస్తే పదేపదే విసిగింపు

తాడేపల్లిగూడెం రూరల్ జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గతంలో కరోనా నుంచి ప్రజలను అప్రమత్తం చేసేందుకు కాలర్ ట్యూన్‌గా పెట్టే జాగ్రత్తల స్థానంలో మళ్ళీ సైబర్ నేరాలపై ప్రభుత్వం అప్రమత్తం చేస్తోంది. జాగ్రత్తగా ఉండండి. సైబర్ నేరాల అదుపుకు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని చెప్తున్నా సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త పంథా అవలంబిస్తున్నారు. కొన్నాళ్లు ఓటీపీలు అంటూ మోసగిస్తే తరువాత ఆన్‌లైన్ ఆఫర్స్ అంటూ ప్రజలను ఇబ్బంది పెట్టారు. ఇంకాస్త ముందుకెళ్ళి ఈసారి ప్రజల ఫోన్ హ్యాక్ చేయడం, క్రెడిట్ కార్డు అంటూ వల వేసి సొమ్ములు దోచేయడం చేస్తున్నారు. ఇంకాస్త అప్రమత్తంగా ఉన్నవారిపై బెదిరింపులకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. తాజాగా తాడేపల్లిగూడెంలో ఈ ఫేక్ కాల్ వల్ల ఓ వ్యక్తి ఆందోళనకు గురై ఆసుపత్రి పాలయ్యాడు.

కాల్ సెంటర్: హలో మేం క్రెడిట్ కార్డ్స్ నుంచి ఫోన్ చేస్తున్నాం. మీకు వ్యక్తిగతంగా రూ. 4లక్షల లిమిట్‌తో క్రెడిట్ కార్డు ఆఫర్ వచ్చింది.

రమేష్: హలో మాకు క్రెడిట్ కార్డు వద్దు.

కాల్ సెంటర్: లేదు సార్.. మీకు మంచి ఆఫర్ వచ్చింది. ఎలాంటి సర్వీస్ ట్యాక్స్‌లు లేకుండా ఉచితంగానే ఈ క్రెడిట్ కార్డు అందిస్తున్నాం.

రమేష్: మాకే ఎందుకు ఈ ఆఫర్ వచ్చింది.

కాల్ సెంటర్: లేదు సార్ మీ బ్యాంకు లావాదేవీలు ఆధారంగా ఈ క్రెడిట్ కార్డు అందిస్తున్నాం.

రమేష్: అయితే మా వివరాలు నోట్ చేసుకోండి.

కాల్ సెంటర్: అన్ని వివరాలు, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ నెంబరు, పాన్ కార్డ్ తోపాటు వ్యక్తిగత వివరాలు అడుగుతారు. చివరికి క్రెడిట్ కార్డు నుంచి క్లియరెన్స్ కోసం ఓ మెసేజ్ వస్తుంది. అందుల్లో ఓటీపీ చెప్పండి చాలు.

రమేష్: బాబోయ్ ఓటీపీ చెప్పడం కుదరదు.

కాల్ సెంటర్: లేదు సార్ లేదంటే మీరే ఆ లింక్ క్లిక్ చేసి మీరే వివరాలు నమోదు చేసుకోండి, సరిపోతుంది.

రమేష్: ఏమీ లింక్ అదేమి వద్దు పెట్టేయ్యండి.

ఇలా ఫోన్ పెట్టేసిన తరువాత పది సార్లు వివరాలు చెప్పాలని అడుగుతారు. ఏమైనా ఖర్మకాలి వారు పంపిన లింక్ క్లిక్ చేసినా, లేదంటే ఓటీపీ చెప్పినా మీ ఖాతాలోని సొమ్ములు ఖాళీఅవుతాయి. అవేమి చెప్పకుండా అప్రమత్తంగా ఉన్నవారికీ మరో రకమైన టార్చర్ మొదలవుతుంది. ఇదేలా అంటే...

కాల్ సెంటర్: సార్ క్రెడిట్ కార్డు ఆఫర్ ఉంది.

రమేష్ : మాకెలాంటి కార్డు వద్దంటూ పెద్దగా మాట్లాడితే అంతే మొదలవుతుంది టార్చర్.

కాల్ సెంటర్: ఎంటి అరుస్తున్నారు. మీ ఊరిలో సుబ్బారావు మీ పేరుతో లోన్ తీసుకున్నారు. మీ ఆధార్ కార్డు, పాన్ కార్డు అన్ని వివరాలు మాకు ఇచ్చాడు. ఇప్పుడు అతను లోన్ చెల్లించడంలేదు. వెంటనే మీరు కట్టాలి. అంటూ టార్చర్ చేస్తారు. ఇంకా గట్టిగా మాట్లాడితే మా బ్యాంకుకు రండి లేదంటే మీపై కేసు పెడతాం అంటూ బెదిరింపు. ఇదెక్కడి గోల, ఆ లోన్ ఏంటని అడిగితే ఈఎంఐ చెల్లించాలంటూ మన దగ్గర సొమ్ములు లాగేస్తారు. కాదని మొండికేస్తే వందల కొద్ది కాల్స్‌తో మనశాంతి లేకుండా చేస్తున్నారు.

రోజుకో కొత్త పంథా

సైబర్ నేరగాళ్ళ టార్చర్ మామూలుగా ఉండదు. ఈకేవైసీ అంటారు. మేము పంపే లింక్‌ను ఓపెన్ చేసి ఈకేవైసీ పూర్తి చేయండి లేకుంటే మరో గంటలో మీ ఫోన్ కట్ అవుతుంది. నెంబర్ బ్లాక్ చేస్తాం అంటూ వాయిస్ కాల్ వస్తుంది. ఈ తరహా కాల్స్ దాదాపుగా సెల్‌ఫోన్ కలిగి ఉన్న ప్రతి ఒక్కరికి వస్తుంటుంది. ఎవరైనా ఈ కాల్స్‌కు స్పందించి వారు పంపిన లింక్‌లు నొక్కితే బ్యాంకుల్లో డబ్బు కొట్టేస్తారు. ఇలా రోజుకో కొత్త పంథాతో సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. వీరిని ట్రేస్ చేసి పోలీసులు కొంత మందిని పట్టుకుంటున్నా... పోలీసులకు దొరకని వారు చాలా మంది ఉంటున్నారు. చాలా తెలివిగా ఎప్పటికప్పుడు కొత్త టెక్నాలజీని ఉపయోగిస్తూ సైబర్ నేరగాళ్ళు రెచ్చిపోతున్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు

50 గ్రాముల బంగారం, 150 గ్రాముల వెండి స్వాధీనం



విలేకర్లతో మాట్లాడుతున్న సీఐ యాదగిరి

నరసాపురం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతాల్లో రెండేళ్లగా చోరీలకు పాల్పడుతున్న కె.అరుణ్‌కుమార్, ఎం.రాజ్‌కుమార్‌లను ఆదివారం వల పన్ని పట్టుకున్నారు. వీరి వద్ద 50 గ్రాముల బంగారు, 150 గ్రాముల వెండి, ఐదు వేలు నగదు, ఒక ల్యాప్ టాప్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ యాదగిరి చెప్పారు. ఆదివారం రాత్రి టౌన్ స్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ పట్టణంలోని దేశబత్తుల విజయజ్యోతి నివాసంలో గత ఏడాది తాళం తలుపులు ప్రార్ధనా మందిరానికి వెళ్లిందన్నారు. ఇంటికి వచ్చే సరికి తలుపులు పగలగొట్టి బంగారం, వెండి వస్తువులు చోరీకి గురయ్యారన్నారు. ఇదే నెలలో కటకంశెట్టి వేణుగోపాల్ ఇంటికి తాళం వేసి భీమవరం అస్పత్రికి వెళ్లి వచ్చే సరికి తలుపులు పగలగొట్టి బంగారం, వెండి వస్తువులు చోరీ చేసినట్టు ఫిర్యాదు అందాయన్నారు. మొగల్తూరు మండలం రామన్నపాలెంకు చెందిన కె.అప్పా రావు తన కుటుంబ సభ్యులతో కలిసి విజయవాడ వెళ్లాడ న్నారు. తిరిగి ఇంటికి వచ్చిచూస్తే ఇంటి తాళాలు పగల గొట్టి ఎల్‌ఈడీ టీవీ, వెండి వస్తువులు పోయినట్లు ఫిర్యాదు వచ్చిందన్నారు. నమోదైన కేసులపై దృష్టి పెట్టగా కాకినాడకు చెందిన అరుణ్‌కుమార్, మట్టవర్తి రాజుకుమార్ చోరీలు చేస్తున్నట్లు తేలిందన్నారు. వీరిపై నిఘా పెట్టగా శనివారం పట్టణంలోని మార్కెట్‌లో సంచరిస్తున్నట్లు పక్కా సమాచారం అందటంతో వీరిద్దరిని అరెస్టు చేశామన్నారు. గతంలో వీరిద్దరిపై మొగల్తూరు, కాకినాడ, నిడమర్రు, తూర్పు గోదావరి, కృష్ణా, ఏలూరు జిల్లాల్లో పదికిపైగా కేసులు ఉన్నాయన్నారు. రూరల్ సీఐ దుర్గాప్రసాద్, ఎస్సైలు జి.వాసు, జయలక్ష్మి పాల్గొన్నారు.

కాల్వలోకి దూసుకెళ్లిన వ్యాన్

కొవ్వూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : వ్యాన్ టైర్ పంక్చరై రోడ్డు పక్కన కాలువలోకి దూసుకెళ్లడంతో ఆరుగురు వ్యక్తులకు గాయాలైనట్టు కొవ్వూరురూరల్ హెచ్‌సీ ఆర్.భగవాన్‌దాస్ తెలిపారు. టి.నర్సాపురం మండలం శ్రీరామవరం గ్రామానికి చెందిన 9 మంది వాడపల్లి వెంకటేశ్వరస్వామి గుడికి బయలుదేరారు. కొవ్వూరు మండలం కాపవరం హైవేలో ఫ్లైఓవర్‌పై వ్యాన్ టైరు పంక్చరై రోడ్డు పక్కన కాలువలోకి పడింది. వ్యాన్ గ్లాస్ పగిలి ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో మేరువ లీలా కుమారి, అడపా లావణ్య, డ్రైవర్ జవ్వా నాగేశ్వరరావుతో పాటు మరో ముగ్గురికి గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లీలాకుమారికి పక్కటెముకలపై గాయం కావడంతో చికిత్స నిమిత్తం ఏలూరు ఆసుపత్రికి తరలించారు. కేసునమోదు చేసినట్టు రూరల్ హెచ్‌సి ఆర్. భగవాన్‌దాస్ తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అదృశ్యం

చించినాడ బ్రిడ్జిపై యువకుడి మోటారు సైకిల్

యలమంచిలి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): వీరవాసరం మండలం జొన్నలపాలెం గ్రామానికి చెందిన మెతుకుమిల్లి నాగవెంకట సతీశ్ (33) శనివారం నుంచి కనిపించకుండా పోవడంతో మిస్సింగ్ కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ కె.గుర్రయ్య తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బెంగుళూరులోని ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న మెతుకుమిల్లి నాగవెంకటసతీశ్ వర్క్ ఫ్రం హోంగా ఇంటివద్ద నుంచి విధులు నిర్వర్తిస్తున్నాడు. భీమవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బంధువును చూసి వస్తానని శనివారం ఇంటివద్ద చెప్పి వెళ్లిన సతీశ్ తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు బంధువులు, చుట్టుపక్కల ఆరాతీసినా సతీశ్ ఆచూకీ లభించలేదు. సతీశ్‌కు చెందిన మోటారుసైకిల్ చించినాడ బ్రిడ్జిపై ఉందన్న సమాచారం ఆదివారం మధ్యాహ్నం అతని కుటుంబసభ్యులకు తెలిసింది. బ్రిడ్జివద్దకు చేరుకున్న సతీశ్ కుటుంబసభ్యులు మోటారు సైకిల్ సతీశ్‌దేనని నిర్ధారించుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం మండలంలోని శోభనాద్రిపురం గ్రామానికి చెందిన మహిళ అదృశ్యమైనట్లు ఎస్సై ఎస్‌కె.జబీర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శోభనాద్రిపురం గ్రామానికి చెందిన చుండ్రు సుబ్బారావు దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. ఈ నెల 22 రాత్రి భోజనం అయిన తరువాత అందరూ నిద్రించారన్నారు. తెల్లవారు జామున భర్త సుబ్బారావు లేచి చూడ గా తన భార్య కనపడలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకి కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఫిర్యాదులో గ్రామానికి చెందిన మందల కృష్ణ అనే వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికెన్ వ్యర్థాల వాహనం పట్టివేత

పెదపాడు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాలను తరలిస్తుండగా పెదపాడు వద్ద తనిఖీలు నిర్వహించి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లుగా పెదపాడు ఎస్సై కట్టా శారద సతీశ్ తెలిపారు. వాహనంలోని చికెన్ వ్యర్థాలను స్వాధీనం చేసుకుని వాహన యజమాని, డ్రైవర్లపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒకే రోజు ఐదు చోట్ల దొంగతనాలు

నిత్యం జనసంచారం ఉండే ప్రదేశాల్లో చోరీలు

వేలిముద్రలు సేకరించిన క్లూస్‌టీమ్



ఫొటో స్టూడియోలో టార్చ్‌లైట్ వేసుకొని సొరుగులు చూస్తున్న దొంగ

ఆకివీడు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఒకేరోజు ఐదు చోట్ల దొంగతనాలు చేశారు. నిత్యం జనసంచారం ఉండే ప్రాంతాల్లో దొంగలు తాళాలు పగలుకొట్టి దొంగతనాలు చేయడంతో వర్తకులు, ప్రజానీకం భయాందోళన చెందుతున్నారు. రెండుచోట్ల వేర్వేరు దొంగలు దొంగతనం చేయడం, ఇద్దరు మోటారు సైకిల్‌పై, ఒకరు కాలినడకన తిరగడం సీసీ కెమెరాల్లో కనబడుతున్నాయి. స్థానిక దొరగారిచెరువు నుంచి సిద్ధాపురం వైపు వెళ్ళు రైల్వేగేటు రోడ్డులోను, వెలంపేట నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్ళే రహదారిలో దొంగతనాలు చేయడంతో జనం ఉలిక్కిపడ్డారు. ఈరెండు ప్రాంతాలలో ప్రయాణికులు, వర్తకులు, స్థానికులు తిరుగుతూనే ఉంటారు. సిద్ధాపురం రోడ్‌లో దేవి లక్ష్మీ కిరాణా, అంజి ఫొటోస్టూడియో, ఫస్ట్ ఎయిడ్ సర్వీస్-మందుల షాపుల తాళాలు పగలుకొట్టారు. ఫొటో స్టూడియోలో సుమారు రూ.లక్ష విలువచేసే కెమెరా, హార్డ్‌డిస్క్ దొంగిలించారు. మిగిలిన రెండుచోట్ల చిల్లర దొంగిలించారు. వెలంపేట నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్ళే దారిలో శ్రీనివాసా రైస్ ఎంటర్ ప్రైజెస్, స్రవంతి కిరణా మర్చంట్ తాళాలు పగలుకొట్టి చిల్లరు పట్టుకెళ్ళారు. దుకాణ వర్తకులకు తాళాలు పగలుకొట్టి ఉన్నాయని సమాచారం రావడంతో వచ్చి పరిశీలించారు. ఎస్ఐ హనుమంతు నాగరాజు పోలీసులు వచ్చి సీసీ కెమెరాలు ప రిశీలించారు. క్లూస్‌టీమ్ వచ్చి వేలిముద్రలు సేకరించారు.పెద్దగా చోరీకి గురికాకపోవడంతో ఫిర్యాదులు చేయలేదు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

చెరువులో పడి బాలుడి గల్లంతు

దెందులూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : చెరువులో పడి బాలుడు గల్లంతయ్యాడు. సీతంపేట గ్రామానికి చెందిన ముగ్గురు పిల్లలు ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో గ్రామం మధ్యలో ఉన్న నాగుల చెరువు సమీపంలో ఆడుకుంటుండగా సీతం పేట గ్రామానికి చెందిన గుజ్జల నాగరాజు చిన్న కుమారుడు శివశంకర్ (9) అదుపు తప్పి చెరువులో పడ్డాడు. గ్రామస్థులు, తల్లిదండ్రులు చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. చీకటిగా ఉండటంతో బాలుడు ఆచూకి దొరకలేదు. సోమవారం ఉదయం ప్రత్యేక బలగాలతో చెరువులో గాలింపు చర్యలు ప్రారంభిస్తామని ఎస్ఐ శివాజీ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో జడ్పీటీసీకి గాయాలు



ద్వారకాతిరుమల, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల జడ్పీటీసీ సభ్యుడు చిగురుపల్లి శామ్యూల్ ఆదివారం రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. సొంత కారు నడుపుకుంటూ వెళుతున్న ఆయన సీట్ బెల్ట్ పెట్టుకున్న కారణంగా స్వల్పగాయాలతో బయట పడ్డారు. వెంకట్రామన్న గూడెం సమీపంలోని ఓ గ్రామంలో జరుగుతున్న విందుకు హాజరయ్యేందుకు గాను తన ఇద్దరు స్నేహితులతో కలసి వెళ్తున్నారు. నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెం దాటిన తర్వాత ఎదురుగా వేగంగా వస్తున్న టాటా ఏస్ వ్యాను ఈయన కారును ఢీకొట్టింది. కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసం కాగా అందులో ప్రయాణిస్తున్న వారు స్వల్పగాయా లతో బయటపడ్డారు.

వేర్వేరు చోట్ల ఎక్సైజ్ దాడులు

బెల్ట్‌షాపు నిర్వాహకుల అరెస్టు

పెనుగొండ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్. మణికంఠ రెడ్డి తెలిపారు. ఆదివారం పెనుగొండ మండలం దేవ గ్రామంలో జరిపిన దాడుల్లో మామిడిశెట్టి సత్యనారాయణ అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 10 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణంలోని యాగర్లపల్లిలో అక్రమంగా బెల్ట్ షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ స్వరాజ్యలక్ష్మి తెలిపారు. ఆ వ్యక్తి నుంచి 15 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. ఈ దాడిలో ఎస్సైలు మురళిమోహన్, దొరబాబు పాల్గొన్నారు.

పాలకొల్లు టౌన్: పూలపల్లిలో బెల్ట్ షాపు నిర్వాహకుడు జి.సుబ్బారావు అనే వ్యక్తిని అరెస్టు చేసి, 9 మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. దాడుల్లో ఎస్‌ఐలు జి.మహేష్, జి.రఘు, సిబ్బంది పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ పోలీసులు పట్టణంలో బెల్ట్ దుకాణాలపై దాడులు నిర్వహించా రు. ఈదాడిలో ఒక వ్యక్తి నుంచి 11 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు. ఈ దాడిలో ఎస్సైలు జి.వెంకటలక్ష్మి, ఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు మెరుగైన వైద్య సహాయం అందిస్తాం

గుంటూరు మెడికల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో కాలిన గాయాలతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చేరిన క్షతగాత్రులకు మెరుగైన వైద్య సహాయం అందిస్తున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. 24వ తేదీ శుక్రవారం రాత్రి ఏలూరు జిల్లా మందవల్లి మండలం శోభనాద్రిపురంలో ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో 14 మంది గాయపడగా, అందులో ఏడుమందిని మెరుగైన వైద్యసేవల కోసం గుంటూరు జీజీహెచ్‌లో చేర్పించారు. మిగిలిన వారు ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

యథేచ్ఛగా మాంసం, చేపల విక్రయాలు



ద్వారకాతిరుమల, జనవరి 26(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం నాడు ద్వారకాతిరుమలలో మాంసం, చేప్ప విక్రయాలు యథేచ్ఛగా జరిగాయి. సంతమార్కెట్‌లో బహిరంగంగా విక్రయాలు జరిగినా అధికారులు ఆవైపు కన్నెత్తి కూడా చూడలేదు. జెండా వందనం జరిగిన రోజున మాంసం, చేపలు విక్రయాలు జరుగకూడదని చెబుతున్నా ఎవరూ పట్టించుకోలేదు. యథేచ్ఛగా విక్రయాలు జరగడంతో మాంసం ప్రియులు వాటి కొనుగోలుకు ఎగబడ్డారు. కొందరు దుకాణదారులు షాపు వెనుక నుంచి విక్రయాలు జరిపారని స్థానికులు చెబుతున్నారు.







కలెక్టరేట్‌లో జేసీ ధాత్రిరెడ్డి, క్యాంపు కార్యాలయంలో ఎస్పీ కిశోర్, ఎక్సైజ్ కార్యాలయం వద్ద డిప్యూటీ కమిషనర్ శ్రీలత, ఏలూరు టీడీపీ కార్యాలయంలో గన్ని, బడేటి జెండా వందనం, జంగారెడ్డిగూడెంలో న్యాయాధికారి కిశోర్ కుమార్ పతాకావిష్కరణ

ఘనంగా గణతంత్ర వేడుకలు

జాతీయ పతాకావిష్కరణలు.. దేశ నాయకులకు ఘన నివాళులు

ఏలూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ దేశ సమగ్రత, సమైక్యతకు కృషి చేయాలని జేసీ పి. ధాత్రిరెడ్డి కోరారు. ఏలూరు కలెక్టరేట్‌లో ఆమె త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. తొలుత మహాత్మాగాంధీ విగ్రహానికి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళి అర్పించారు. జిల్లా రెవెన్యూ అధికారి వి. విశ్వేశ్వరరరావు, ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీష్, డీఎస్‌వో రాజు, జిల్లా మేనేజర్ వి. శ్రీలక్ష్మి, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎన్ పుష్పలత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవికాదేవి, కె. భాస్కర్, కలెక్టరేట్ ఏవో నాంచారయ్య పాల్గొన్నారు. నగరంలోని ఆఫీసర్స్ క్లబ్‌లో జరిగిన వేడుకల్లో జేసీ ధాత్రిరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. పలువురు రిటైర్డు అధికారులు పాల్గొన్నారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన వేడుకల్లో తమ వ్యాఖ్యానాలతో అలరించిన ఆర్టీసీ పీఆర్‌వో కేఎల్‌వీ నరసింహం, రామసింగవరం జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయురాలు జి. నీలిమ కలెక్టర్ కె వెట్రిసెల్వి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు. జిల్లా సమాచార, పౌరసంబంధాలశాఖ ఏలూరు కార్యాలయంలో ఆడియో విజువల్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న సీహెచ్ రాంబాబు, టెక్నికల్ సబార్డినేట్ గంగాధర్, ఫోటోగ్రాఫర్ సాగర్ ఉత్తమ సేవలకు కలెక్టర్ వెట్రిసెల్వి ప్రశంసాపత్రాలతో అభినందించారు.

ఏలూరు క్రైం: ఏలూరు జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయం వద్ద జిల్లా ఎస్పీ కిషోర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏలూరు సురేష్ చంద్ర బహుగుణ ఇంగ్లీషు మీడియం స్కూలులో జాతీయ జెండా ఎగురవేశారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద అదనపు ఎస్పీ ఎస్. సూర్యచంద్రరావు జాతీయ పతాక ఆవిష్కరించారు. ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న బార్ అసోసియేషన్ భవనం వద్ద ఏలూరు బార్ అధ్యక్షుడు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోనే సీతారామ్ జాతీయ జెండా ఎగురవేసి జెండా వందనం చేశారు. ఈ కార్యక్రమం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి ఎం సునీల్‌కుమార్, న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, ఏలూరు బార్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న బార్ అసోసియేషన్ భవనం వద్ద ఏలూరు బార్ అధ్యక్షుడు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోనే సీతారామ్ జాతీయ జెండా ఎగురవేసి జెండా వందనం చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి ఎం సునీల్‌కుమార్, న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, ఏలూరు బార్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఏలూరు: శనివారపుపేటలోని ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ కార్యాలయం వద్ద జరిగిన వేడుకల్లో ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీలత జెండాను ఆవిష్కరించగా అసిస్టెంట్ కమిషనర్ ప్రభుకుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆనాల అవులయ్య పాల్గొన్నారు. కలెక్టరేట్‌లోని జిల్లా సహకార శాఖాధికారి కార్యాలయం వద్ద డీసీవో ఆరిమిల్లి శ్రీనివాసరావు జెండా ఆవిష్కరణ చేశారు.

ఏలూరు అర్బన్: సీఆర్ఆర్ కళాశాల ప్రాంగణంలో కరస్పాండెంట్ డాక్టర్ విష్ణుమోహన్, ప్రిన్సిపాల్ రామరాజు ఎన్‌సీసీ కేడెట్ల గౌరవ వందనాన్ని స్వీకరించారు. కోటదిబ్బ ప్రభు త్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ గిరిబాబు దేశ ప్రగతిని విద్యార్థులకు వివరించారు.

లింగపాలెం: తహసీల్దార్ నజీముల్లాషా, ఎంపీడీఓ కే వాణి, ఎస్‌ఐ కే వెంకన్న తమ కార్యాలయాల వద్ద, పంచాయితీ కార్యాలయాల వద్ద సర్పంచ్‌లు జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

ఏలూరు రూరల్: ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వెన్నా శ్రీలత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎంపీపీ శ్రీనివాసరాజు పాల్గొన్నారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్, వైసీపీ జిల్లా కార్యాలయంలో ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మామిళ్ళపల్లి జయప్రకాష్, దొండపాడు పరివర్తన పాఠశాలలో విభిన్న ప్రతిభావంతుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ రామ్‌కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. వై.ఎం.హెచ్.ఏ ప్రాంగణంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జవ్వాజి మోహన్ విఠల్, వై.సోమలింగేశ్వరరావు, కె.వి సత్యనారాయణ, వేణుగోపాల్ లునాని, అంబికా రాజా పాల్గొన్నారు. జనసేన కార్యాలయంలో ఆర్టీసీ విజయవాడ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు జెండా ఆవిష్కరించారు.

ఏలూరు టూ టౌన్: టీడీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్యతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్, కో-ఆప్షన్ సభ్యుడు పెదబాబు, మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి అంజనేయులు, మునిసిపల్ మాజీ ఛైర్మన్ ఉప్పాల జగదీష్ బాబు తదితరులు పాల్గొన్నారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో మేయర్ షేక్ నూర్జహాన్ గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదనపు కమిషనర్ చంద్రయ్య, డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి పాల్గొన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు జెండాను ఆవిష్కరించారు. ఏలూరు శాంతినగర్‌లోని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కార్యాలయంలో కూటమి నాయకులు, కార్యాలయం సిబ్బందితో కలిసి జడ్పీ విశ్రాంత సీఈవో చిరువోలులంక కుమారస్వామి జాతీయ జెండా ఆవిష్కరించారు. జాతీయ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నందిగం సీతారాం తిలక్, కాట్రు బాలకృష్ణ, ఆలూరి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: వంకవారిగూడెం వాల్మీకి విద్యానికేంద్రం ఓరియంటల్ పాఠశాలలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు భరత మాత విగ్రహానికి పూలమాలలు వేసి జాతీయ జెండా ఆవిష్కరించారు.

ఏలూరు: జంగారెడ్డిగూడెం ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ ఎంవీ రమణ జాతీయ జెండా ఆవిష్కరించారు. పలువురు రెవెన్యూ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.కిషోర్, తహసీల్దారు కె.స్లీవ జోజి, డీఎస్పీ యు.రవిచంద్ర, మున్సిపల్ కమిషనర్ కేవీ రమణ, ఎంపీడీవో కృష్ణ ప్రసాద్ తమతమ కార్యాలయాల వద్ద జాతీయ జెండాను ఎగురవేశారు. పట్టణ టీడీపీ కార్యాలయం వద్ద పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం పలువురు నాయకులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జంగారెడ్డిగూడెంలో ముస్లింల ఆధ్వర్యంలో స్థానిక బిలాల్ మసీదు వద్ద నిర్వహించిన వేడుకల్లో జంగారెడ్డిగూడెం రవాణా శాఖాధికారి జాతీయ జెండా ఆవిష్కరించారు.

ఏలూరు: పోలవరంలో ఏపీ ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు దేశ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జి తహశీల్దారు కె శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎస్‌ఐ పవన్ కుమార్, అటవీ క్షేత్రాధికారి వలీ తమ కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

పెదపాడు: పెదపాడు తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు కృష్ణజ్యోతి, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో అమీలు జమ, ఎంఈవో కార్యాలయంలో ఎంఈవోలు సబ్బితి నరసింహమూర్తి, దేవినేని వెంకటరమణ, ఐసీడీఎస్ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌లో జెండాలను ఆవిష్కరించారు.

పెదవేగి: పెదవేగి పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ రామకృష్ణ, తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు భ్రమరాంబ, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. దుగ్గిరాలలోని సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాలలో వేడుకలు నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్ పతాకావిష్కరణ చేశారు. భోగాపురం దగ్గర జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన 235 అడుగుల భారీ జాతీయ పతాకాన్ని బూరాయిగూడెంలోని సమరసత ఫౌండేషన్ రామాలయం అర్చకుడు గోరింకల వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు.

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ బొండాడ మోహినీ వెంకన్నబాబు జెండా వందనం చేశారు. పోలీస్ స్టేషన్, ప్రభుత్వ కార్యాలయాల వద్ద పతాకావిష్కరణలు జరిగాయి. జడ్పీటీసీ శామ్యూల్, ఎంపీడీవో ప్రకాష్, తహసీల్దారు సుబ్బారావు, ఏఎస్‌ఐ అమీర్, ఎంఈఓ పి వెంకట్రావు పాల్గొన్నారు.

చింతలపూడి: మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ డి.పావని, ఎంపీడీవో కార్యాలయంలో ఏవో కామేశ్వరి పతాకావిష్కరణ గావించగా ఎమ్మెల్యే రోషన్‌కుమార్ జెండా వందనం చేశారు. కాంగ్రెస్ కార్యాలయంలో మండల అధ్యక్షుడు సుందరరావు పతాకాన్ని ఆవిష్కరించారు.

భీమడోలు: మండలంలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. భీమడోలు టీడీపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పద్మావతిదేవి జాతీయ జెండాలను ఆవిష్కరించారు. మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కమ్యూనిటీ భవనంలో వేడుకలు నిర్వహించారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథ పాలకుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. భీమడోలు సర్పంచ్ పాముసునీతా మాన్‌సింగ్, జడ్పీటీసీ తుమ్మకుంట భవానీ రంగ తదితరులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం: కేఆర్ పురం ఐటీడీఏ కార్యాలయం వద్ద ప్రాజెక్టు ఆఫీసర్, ఆర్ అండ్ ఆర్ ఆఫీసర్ కె.రాములు నాయక్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.

కుక్కునూరు: మండలంలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు జెండాను ఆవిష్కరించారు. కుక్కునూరు స్లోకా కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

వేలేరుపాడు: మండలంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. డాన్ బాస్కో ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. హైస్కూల్‌లో విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

కామవరపుకోట: పంచాయతీ కార్యాలయం వద్ద గణతంత్ర వేడుకలను సర్పంచ్ కరిపోతు అనూష ఆధ్వర్యంలో నిర్వహించారు. పంచాయతీ సిబ్బందికి దుస్తుల కిట్‌లను అందచేశారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఘంటా సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

టి.నరసాపురం: మండలంలో గణతంత్ర వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ టి.సాయి బాబా, ఎంపీడీవో మణికుమారి, ఎస్సై ఎం.జయబాబు తమ కార్యాలయాల్లో పతాకావిష్కరణలు గావించారు. అప్పలరాజుగూడెం గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ శంకరరావు పతాకాన్ని ఆవిష్కరించారు.



క్లబ్ నూతన కార్యవర్గానికి ఎన్నికైన నాయకులు

ఏలూరు క్లబ్ నూతన కార్యవర్గం

ఏలూరు అర్బన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఏలూరు క్లబ్ వార్షిక సర్వసభ్య సమావేశం ఆదివారం క్లబ్ ఆవరణలో జరిగింది. ప్రస్తుత సంవత్సరానికి క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుత్తా పిచ్చియ్యచౌదరి, కార్యదర్శులుగా గుత్తా బాలచంద్ర కళాధర్ (రాజా), కన్నెగొళ్ళ సుధీర్‌ను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా అప్పికట్ల వెంకట రామాంజనేయులు, అడవికొలను వెంకట సత్య సూర్యారావు, పయిడేటి రమేష్ కుమార్, జాస్తి శ్రీరామ్, కలగర కిషోర్‌కుమార్, పాలడుగు రాజేంద్రప్రసాద్, రావూరి మాధవరావు, గూడపాటి మధుసూదనరావు, చలసాని సత్యనారాయణ ఎన్నికయ్యారు. క్లబ్ నూతనకార్యవర్గానికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ అధ్యక్షుడు కిలారు ప్రభాకరరావు పాల్గొన్నారు.



ప్రథమ బహుమతి అందుకుంటున్న వెంకటేశ్వరరావు

వెటరన్స్ వాక్‌థాన్ విజేతలు వీరే..

ఏలూరు అర్బన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పడమరవీధి ప్రశాంతి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వెటరన్స్ వాక్‌థాన్ నిర్వహించారు. 60 ఏళ్ల దాటిన వారికి నిర్వహించిన 2 కిలోమీటర్ల నడకపోటీలో తొలి మూడు స్థానాల్లో నిలిచిన జె.వెంకటేశ్వరరావు, జి.వి.వి.ఎస్.రామారావు, పి.ధర్మారావుకు బహుమతులందజేశారు. వీరితోపాటు 60 ఏళ్ళలోపు వయస్సుగల వారికి నిర్వహించిన నడక పోటీలో విజేతలుగా నిలిచిన బి.రామారావు, ఏ.వి.జి.చక్రవర్తి, టి.ఈశ్వరరావులకు బహుమతులు అందజేసారు. తొలుత వాకర్స్ క్లబ్‌లో జాతీయజెండాను క్లబ్ ప్రతినిధులు దున్నా వెంకటేశ్వరరావు, డాక్టర్ హరికృష్ణ భగవాన్ ఆవిష్కరించారు.

టెక్సాస్ చెస్ ఛాంపియన్‌గా కుశల్



ఏలూరు రూరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అమెరికాలో అండర్-12 కేటగిరి విభాగంలో టెక్సాస్ స్టేట్ రీజియన్ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఏలూరుకు చెందిన తపన్ కుశల్ ద్వితీయ స్థానం సాధించాడు. ఇతను గత ఏడాది డల్లాస్ సిటీ స్థాయిలో జరిగిన చెస్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచాడు. తపన్ కుశల్ ఇప్పటివరకు ఫ్రిస్కో, డల్లాస్‌లో జరిగిన చెస్ పోటీల్లో నాలుగుసార్లు విజేతగా నిలిచాడు. తపన్‌కుశల్ ఏలూరుకు చెంది అమెరికా పౌరసత్వం పొందిన పులి గాయత్రిదేవి, క్రాంతికుమార్ దంపతుల కుమారుడు. సామాజికవేత్త పులిశ్రీరాములు మనుమడు.

తెల్లం బాలరాజుకు పలువురి పరామర్శ

బుట్టాయగూడెం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు మాతృమూర్తి మల్లమ్మ మరణించడంతో డీసీసీబీ మాజీ ఛైర్మన్ కరాటం రాంబాబు, ఎమ్మెల్యే చిర్రి బాలరాజు దుద్దుకూరు వెళ్లి మల్లమ్మ పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించి బాలరాజుకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే ఏపీ ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు తెల్లం బాలరాజును పరామర్శించారు.







కలెక్టర్ నుంచి ప్రశంసా పత్రాలు అందుకుంటున్న (ఎడమ నుంచి కుడికి) ఏలూరు డీఎస్పీ డి శ్రావణ్‌కుమార్, పోలవరం డీఎస్పీ ఎం. వెంకటేశ్వరరావు, కైకలూరు రూరల్ సీఐ రవికుమార్, ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ కాంతిప్రియ, ఏలూరు ట్రాఫిక్ హెడ్‌కానిస్టేబుల్ బి. శ్రీనివాస్

పోలీసు శాఖలో ఉత్తమ సేవలకు ప్రశంసలు

ఏలూరు క్రైం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీస్‌శాఖలో ఉత్తమ సేవలు అందించిన పోలీసు అధికారులు, సిబ్బందికి 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రశంసా పత్రాలను జిల్లా కలెక్టర్ కె వెట్రిసెల్వి, జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్, జేసీ ధాత్రిరెడ్డి అందించి అభినందించారు. ఏలూరు డీఎస్పీ డీ శ్రావణ్‌కుమార్, పోలవరం డీఎస్పీ ఎం వెంకటేశ్వరరావు, కైకలూరు రూరల్ సీఐ వెంకటేశ్వరరావు, జీలుగుమిల్లి సీఐ వెంకటేశ్వరరావు, ఎస్‌బీ సీఐ బోణం ఆది ప్రసాద్, నూజివీడు సీఐ కె రామకృష్ణ, పోలవరం సీఐ పి. బాలసురేష్ బాబు, ఏలూరు సీసీఎస్ సీఐ సిహెచ్ రాజశేఖర్, ఎస్‌ఐ కె చంద్రశేఖర్, ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ కాంతిప్రియ, ఏలూరు డీసీఆర్బీ సీఐ బిడి ప్రసాద్, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఎస్‌ఐ ఎస్ఎస్ఆర్ గంగాధర్, చాట్రాయి ఎస్‌ఐ డి రామకృష్ణ, ఏలూరు వన్‌టౌన్ ఎస్‌ఐ ఎస్‌కె మదీనాబాషా, ద్వారకాతిరుమల ఎస్‌ఐ సుధీర్, పోలవరం ఎస్‌ఐ పవన్‌కుమార్, ఏలూరు డీసీఆర్బీ ఎస్‌ఐ కె రాజారెడ్డి ఏఆర్ రిజర్వు ఇన్‌స్పెక్టర్ జీఎస్‌పి పవన్‌కుమార్, ఏఆర్ ఎస్‌ఐ పి. జనార్ధన్‌రెడ్డి ప్రశంసాపత్రాలు అందుకున్నారు. అలాగే ఏలూరు వన్‌టౌన్ సర్కిల్ కానిస్టేబుల్ ఎన్ శేషుకుమార్, ఏలూరు టూటౌన్ కానిస్టేబుల్ కె వెంకటేశ్వరరావు, ఏలూరు త్రి టౌన్ మహిళా కానిస్టేబుళ్ళు ఎం గౌరీదేవి, భీమడోలు హెడ్‌కానిస్టేబుల్ ఎస్‌కెఎస్ బాజీ, గణపవరం కానిస్టేబుల్ పి కాంతయ్య, కైకలూరు కానిస్టేబుల్ కె రవికుమార్, ముదినేపల్లి కానిస్టేబుల్ ఆర్ ఈశ్వరరావు, నూజివీడు రూరల్ కానిస్టేబుల్ బొల్లుపోకు జయరాజు, ఆగిరిపల్లి కానిస్టేబుల్ అలీ, నూజివీడు రూరల్ కానిస్టేబుల్ అంపోలు వాసుదేవరావు, తడికలపూడి కానిస్టేబుల్ డి అనిల్‌కుమార్, చింతలపూడి కానిస్టేబుల్ కె శివాజీ, వేలేరుపాడు కానిస్టేబుల్ జె రవిరాజ్, కొయ్యలగూడెం హెచ్‌సీ జి మోహన కృష్ణారావు, బుట్టాయిగూడెం హెచ్‌సీ టి ఎర్రయ్య, ఏలూరు ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ పివి రాఘవ, ఏలూరు ట్రాఫిక్ హెచ్‌సీ బి శ్రీనివాస్, ఏలూరు పిసీఆర్ కానిస్టేబుల్ పివికె చైతన్య, ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ ఎం. నాగలక్ష్మి, డీసీఆర్బీ హెడ్‌కానిస్టేబుల్ సీతారామయ్య, స్పెషల్ బ్రాంచ్ నూజివీడు హెడ్‌కానిస్టేబుల్ ఎస్‌కె మౌలాలి, స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ జి రంగారావు, భీమడోలు స్పెషల్ బ్రాంచ్ హెచ్‌సీ పి శ్రీనివాస్, ఎఆర్ హెచ్‌సీ ఎ. భాస్కరరావు, డి రామచంద్రరావు, కానిస్టేబుల్ కె శేఖర్, స్పెషల్ పార్టీ ఆర్‌ఎస్‌ఐ సిహెచ్ శివ సతీష్, కానిస్టేబుళ్ళు సూర్యకృష్ణారావు, ఓ విజయ్‌కుమార్, ఎస్‌కె కలీమ్‌పాషా, రేంజ్ ఆఫీస్ హెచ్‌సీ ఎండి ఆలీషరీఫ్, జిల్లా పోలీస్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ నేకూరి సెల్మాన్, జూనియర్ అసిస్టెంట్ ఎంఎం కృష్ణకాంత్, ఆర్‌ఎస్‌ఐ నరేంద్ర (ఐటీకోర్ టీమ్), డీటీఆర్బీ కానిస్టేబుల్ పి మధుసూధనరావులకు ప్రశంసాపత్రాలను అందించారు. ఎస్పీ వీరిని అభినందించారు.

అవార్డు గ్రహీతలకు మంత్రి కొలుసు అభినందన

ఏలూరు, జనవరి 26(ఆంధ్రజ్యోతి) : తెలుగు జాతి ముద్దుబిడ్డలుగా పద్మ విభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ అవార్డులను అందుకున్న వివిధ రంగాల్లోని ప్రముఖులకు రాష్ట్ర సమాచార, గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఒక ప్రకటనలో అభినందించారు. 'మీ జీవిత ప్రయాణం మాకు నిత్య స్ఫూర్తి' అని కొనియాడారు. దువ్వూరి నాగేశ్వరరెడ్డి, నందమూరి బాలకృష్ణ, మందకృష్ణ మాదిగ, మిరియాల అప్పారావు, కెఎల్ కృష్ణయ్య, మాడుగుల నాగఫణి శర్మ, పంచముఖి రాఘవాచార్యలకు అవార్డులు దక్కడం అభినందనీయమన్నారు. దేశంలోనే అత్యున్నత అవార్డులకు ఎంపిక చేసిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని మోడీకి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

మంద కృష్ణమాదిగకు పద్మశ్రీపై హర్షం

చింతలపూడి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లా ఆవరణలో ఎంఆర్‌పిఎస్ అనుబంధ సంస్థల ప్రతినిధుల సమావేశం ఆదివారం జరిగింది. ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించడం రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఎంఆర్‌పిఎస్ స్థానిక నాయకులు ఆత్కూరి సుబ్బారావు పేర్కొన్నారు. పలు పోరాటాలే కాకుండా సామాజిక సమస్యలపై స్పందించే మంద కృష్ణకు ఈ అవార్డు ప్రకటించడంపై ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు. నాయకులు ఎం. శామ్యూల్, ఎస్.కిరణ్, కె.ఏలియా, జి.రాంబాబు, ఆస్కార్, పలువురు అభినందనలు తెలిపారు.

అఖిల గాండ్ల తెలికుల సంఘ సమావేశం

ఏలూరు రూరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం ఏలూరు జిల్లా ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు అంబటి గురుమూర్తి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అఖిలగాండ్ల తెలికుల కార్పొరేషన్ ఏర్పాటు చేసి కులవృత్తుల వారికి ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తిచేశారు. అనంతరం జిల్లా మహిళా కమిటీని ఏర్పాటు చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, చెన్నం వెంకటేశ్వరరావు, వర్కింగ్ అధ్యక్షుడు చిప్పాడ ఆనంద్‌కుమార్, నగర అధ్యక్షుడు ఏ.విజయ్ సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.




కలెక్టర్ చేతుల అవార్డును అందుకుంటున్న పెదవేగి తహసీల్దారు భ్రమరాంబ, ఏలూరు నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి

ఉద్యోగులకు అవార్డులు

పెదవేగి, జనవరి 26(ఆంధ్రజ్యోతి) : పెదవేగి తహసీల్దారు ఎన్.భ్రమరాంబ జిల్లా ఉత్తమ తహసీల్దారుగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి చేతులమీదుగా అవార్డును అందుకున్నారు. అలాగే రెవెన్యూ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్, ఇన్‌చార్జ్ ఆర్‌ఐ కేవీ.సారధి, మండల పరిషత్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ అల్లీ సాహెబ్‌లు వారి వృత్తుల్లో ఉత్తమ అవార్డులను అందుకున్నారు. ఆదివారం జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ అవార్డులను అందించారు. ఈ సందర్భంగా పెదవేగిలోని ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు ఉత్తమ ఉద్యోగ అవార్డులు అందుకున్నవారిని అభినందించారు.

ఏలూరు టూ టౌన్: నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ బి. శివారెడ్డి కలెక్టర్ నుంచి ఉత్తమ సేవా అవార్డు అందుకున్నారు. పారిశుధ్య నిర్వహణలో, రెవెన్యూ వసూళ్లలో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు అవార్డు దక్కింది.

బుట్టాయగూడెం: ఏలూరు జిల్లా కేఆర్ పురం అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు పీవీ నాయుడు ఉత్తమ సేవలకు కలెక్టర్ వెట్టి సెల్వి అవార్డును, ప్రసంశా పత్రాన్ని అందజేశారు. గిరిజనుల అభివృద్ధికి మరింతగా మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఏలూరులో ఐటీడీఏ తరఫున ఏర్పాటుచేసిన స్టాల్స్‌లో వీడీవీకే ఆధ్వర్యంలో వెదురుతో తయారు చేసిన వస్తువులను, గిరిజన మహిళలు తయారు చేసిన జ్యూట్ బ్యాగులను కలెక్టర్ పరిశీలించారు. తెల్లంవారిగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల విద్యార్థినులు నృత్య ప్రదర్శనలో జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు.



ఏలూరు శర్వాణి పాఠశాలలో ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు



ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

లో ఓల్టేజి సమస్యకు పరిష్కారం

బుట్టాయగూడెం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రూ. కోటి వ్యయంతో కూటమి ప్రభుత్వం బుట్టాయగూడెం సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన 8 ఎంవీఏ సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆదివారం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ప్రారంభించారు. ఇక నుంచి లో ఓల్టేజీ సమస్య ఉండదన్నారు. రైతులు కోరినట్టు 9 గంటల పాటు విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. జనసేన నాయకులు కరాటం వెంకటరెడ్డి నాయుడు, కరాటం సాయిబాబా, ఎం.బుచ్చిరాజు సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, విద్యుత్ ఏఈ శ్రీనివాసవర్మ పాల్గొన్నారు.



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోషన్

రహదారి ప్రారంభం

కామవరపుకోట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కామవరపుకోట మండలం తూర్పుయడవల్లి పంచాయతీలోని నల్లగోపువారిగూడెంలో 20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆదివారం చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.




పాఠశాలలో విగ్రహాల ఏర్పాటు

ఏలూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా జంగారెడ్డిగూడెం మండలంలోని శోభనాద్రిపురం ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో పూర్వ విద్యార్థుల సహకారంతో నూతనంగా ఏర్పాటుచేసిన సరస్వతి, జాతిపిత, సర్వేపల్లి రాధాకృష్ణన్, భగత్‌సింగ్ విగ్రహాలను ఎంఈవోలు బి.రాముడు, జి.రాములు ఆదివారం ఆవిష్కరించారు. సర్పంచ్ వి.సత్యవతి, ఉపాధ్యాయులు, ఎంపీటీసీ ఎన్.సుబ్బారావు పాల్గొన్నారు.

చట్టాలను పటిష్టంగా అమలు చేయండి

బుట్టాయగూడెం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): షెడ్యూలు ప్రాంత చట్టాలను పటిష్టంగా అమలు చేయాలంటూ ఆదివాసీ ఐక్య కార్యచరణ కమిటీ జిల్లా ఛైర్మన్ మొడియం శ్రీనివాసరావు, డివిజన్ కార్యదర్శి తెల్లం లక్ష్మణరావు ఆదివారం కెఆర్ పురం ఐటీడీఏలో పీవో కె.రాములు నాయక్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. బాధ్యతలు చేపట్టిన పీవోను నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జివో 57 ప్రకారం ఆదివాసీల అభివృద్ధికి, సంక్షేమానికి, రక్షణకు కృషి చేయాలని కోరినట్లు జెఎసి ఛైర్మన్ శ్రీనివాసరావు తెలిపారు.



డస్ట్ బిన్‌లు కావవి..!



సీఎస్ఐ చర్చ్ వద్ద ప్రధాన డ్రైన్ పరిస్థితి

ప్లాస్టిక్ వ్యర్థాలు, కొబ్బరి బొండాలకు కేరాఫ్
చెత్తా చెదారంతో తరచూ పూడుకుపోతున్న డ్రెయిన్లు
నూజివీడులో ముందుకు పారని మురుగునీరు
దుర్వాసనతో కంపు.. రోడ్లపైకి ప్రవాహం

మురుగునీటి కాల్వలు.. మనం వాడకం నీటితోపాటు వర్షపు నీటిని వీటి ద్వారా బయటకు పంపించేందుకు ఏర్పాటు చేసుకున్నవి. ఎప్పటికప్పుడు వీటిని పూడిక తీయించి, నీటి ప్రవాహాన్ని సాఫీగా వెళ్లేలా చూడాలి. గతంలో ఏడాదికి ఒకటి రెండు సార్లు తీస్తే సరి పోయేది. కాని... నేడు ప్లాస్టిక్ విని యోగం పెరిగిన తర్వాత 'యూజ్ అండ్ త్రో'కు అలవాటు పడిపోయాం. టీ, మంచినీటి గ్లాసులు, కొబ్బరి బొండాలు, స్ట్రాలు, మద్యం బాటిల్స్, వాటర్ ప్యాకెట్‌లు, బాటిల్స్ మొదలై నవి వాడి డ్రెయిన్లలో పాడేయడం పెరి గింది. ఈ కారణంగా పది, పదిహేను రోజులకే అవి పూడుకుపోతున్నాయి. ఈ కారణంగా నీటి ప్రవాహం సరిగా లేక కాల్వలు కంపు కొడుతున్నాయి. సమస్య పైకి కనిపించేంత చిన్నదే కావచ్చు. చిరాకు తెప్పించేదే కావచ్చు. కాని, ఇదే మన ఆరోగ్యాలపై ఎంతో ప్రభావం చూపిస్తోంది. మరోవైపు పెరి గిన జనాభాకు అనుగుణంగా మునిసి పాలిటీ కూడా తగినంత మంది పారి శుధ్య సిబ్బందిని నియమించుకుని, ఎప్పటికప్పుడు పూడికతీతపై దృష్టి పెట్టాలి. నూజివీడు పట్టణంలో డ్రెయి న్‌ల పూడికపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

నూజివీడు(ఆంధ్రజ్యోతి)

ఒకప్పటి జమిందారుల రాజధాని నూజివీడు. వందల సంవత్సరాల చరిత్ర ఈ పట్టణం సొంతం. కాలం మారుతున్నా.. ప్రజలు, వారి జీవన ప్రమాణాలు పెరుగుతున్నా.. ఇంకా పలు సమస్యలు పట్టణాన్ని వెంటాడుతున్నాయి. ఓ వైపు చాలీ చాలని రహదారులతో నిరంతరం ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. మరోవైపు పురాతన కాలం నాటి డ్రెయిన్లు మురుగు నీటి పారుదలను అడ్డుకుంటున్నాయి. ఇవి పూడుకు పోవడంతో వర్షాకాలంలో నీటి ప్రవాహం సరిగా జరగక రోడ్లపై నుంచి పారుతూ ఉంటుంది. ఈ సమయంలో పూడుకుపోయిన డ్రెయిన్లతో పట్టణ వాసుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ఆ డ్రెయిన్‌లలో పూడిక తీసేందుకు ప్రతి సంవత్సరం లక్షలాది రూపాయలు వెచ్చించి, డ్రెయిన్లలో పూడిక తొలగింపు కార్యక్రమం దాదాపు నెల రోజుల ప్రహసనం అంటే అతిశయోక్తి కాదు. అసలు డ్రెయిన్లు పూడుకుపో వడానికి ఎన్నో కారణాలు. రోడ్లపై ఉన్న మట్టి నీటి ప్రవాహంలో కొట్టుకుపోవడం ఒకటైతే.. రోడ్ల పక్కన వేస్తున్న చెత్త అందులోకి చేరడం మరొకటి. కొందరు అవగాహనా రాహిత్యంతో చెత్తను నేరుగా డ్రెయిన్లలో వేయడం ఈ సమ స్యను మరింత జఠిలం చేస్తోంది. ఈ కారణంగా పూడిక తీసిన రెండు, మూడు నెలలకే మళ్లీ యథాతథ స్థితికి చేరుతున్నాయి. డ్రెయిన్లలో చెత్త వేస్తే.. అది కొట్టుకుపోతుందని కొందరు భావిస్తుంటారు. అందుకే ఇలా వేస్తున్నారు. అసలు చిన్నపాటి డ్రెయిన్లలో ఈ చెత్త ఎలా ముందుకు వెళుతుందని అర్థం చేసుకోవాలి. ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తా చెదారాలను పారవేయ డంతో ప్రధాన కూడళ్ల వద్ద పేరుకుపోతోంది. పేరుకు పోయిన ఈ చెత్త వర్షాలు పడిన సమయంలో ప్రధాన రహదారులే డ్రెయిన్లను తలపిస్తున్నాయి. దీంతో పట్టణ వాసుల అవస్థలు అన్నీఇన్నీ కావు..

దాదాపు 12 ఏళ్ల క్రితం నూజివీడు ఆర్డీవోగా పనిచేసిన బి.సుబ్బారావు, వర్తక వాణిజ్య సం ఘాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, చెత్త తరలింపునకు ప్రత్యేక డ్రైవ్‌లను పెట్టగా, నాడు సత్ఫలితాలనిచ్చింది. తర్వాత కాలంలో ఏటా ప్రజాధనం డ్రెయిన్‌లలో పూడికపాలు అవ్వక తప్పడం లేదు. ఇప్పటికైనా నూజివీడు పట్టణం లో వర్తక, వాణిజ్య సంఘాలతో ప్రత్యేక సమావే శాలు నిర్వహించి, చెత్త నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తే డ్రెయిన్లలో సిల్ట్ తొలగింపు భారం తగ్గుతుంది. అదే సందర్భంలో పట్టణంలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా కొబ్బరి బొం డాల గుట్టలను తగ్గించే అవకాశం ఉంటుంది. దీనిపై పాలకులు, అధికారులు నడుం బిగించాలి. వీటి ద్వారానే సమస్యకు కొంతైనా పరిష్కారం లభిస్తుంది.





బాపూ నగర్‌లోని డ్రెయినేజీలో వ్యర్థాలు



నూజివీడు టౌన్ చర్చ్ రహదారి పక్కనే ఉన్న డ్రైనేజీలో పేరుకుపోయిన వ్యర్థాలు

సీఆర్డీఏ పరిధిలో ఉన్నా..

రాష్ట్ర రాజధాని పరిధిలోని మున్సిపాలిటీల్లో నూజి వీడు ఒకటి. ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలో పురా తన మునిసిపాలిటీల్లో ఒకటిగా ఉన్న నూజి వీడు పట్టణం క్రమక్రమంగా విస్తరిస్తోంది. అయితే తొలి నాళ్లలో ఎంత మంది పారిశుధ్య సిబ్బంది ఉన్నారో అంతే సిబ్బంది నేటికి కొనసాగడంతో పారిశుధ్య నిర్వహణ భారంగా మారుతోంది. పట్టణంలో రహదారుల పొడవును అనుసరించి పారిశుధ్య సిబ్బంది నియామకంపై దృష్టి సారి స్తామని శనివారం నూజివీడును సందర్శించిన ఆర్‌జేడీ సీహెచ్ నాగనరసింహారావు వెల్లడించారు. ఆయన మాటలు ఆచరణలోకి రావడంతో పాటు సిబ్బందిని సమర్థవంతంగా వినియోగిం చడం ద్వారా నూజివీడును క్లీన్ టౌన్‌గా మార్చ వచ్చు.

మంత్రి హామీ నెరవేరేనా..?

జమిందారుల కాలం నాటి నూజివీడు పురాతన డ్రెయిన్‌లతోనే నెట్టుకొస్తోంది. ఈ నేపథ్యంలో నూజివీడు పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజి ఏర్పాటు చేసి మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దుతానని సార్వత్రిక ఎన్నికల సమయంలో నూజివీడు శాసన సభ్యులుగా పోటీ చేసిన ప్రస్తుత రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి పట్టణ వాసులకు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన అనంతరం ఆ హామీని ప్రస్తావిస్తూ డీపీఆర్‌ను కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామంటూ పలు సందర్భాల్లో పేర్కొన్నారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఆ ప్రతిపాదన ఆచర ణలోకి వచ్చి మంత్రి హామీ నెరవేర్చాలని పట్టణ వాసులు కోరుతున్నారు. తద్వారా ప్రతి నిత్యం సిల్ట్ తొలగింపునకు ఖర్చు చేస్తున్న లక్ష లాది రూపాయల ప్రజాధనాన్ని ఆదా చేసే అవకాశం ఉంటుందని వారు పేర్కొంటున్నారు.



పొట్టి శ్రీరాములు బొమ్మ సెంటర్లో డ్రైన్ పరిస్థితి

సచివాలయాలను భాగస్వామ్యం చేయాలి



నూజివీడు పట్టణంలోని డ్రైనేజీల్లో చెత్త వేయకుండా పర్యవేక్షించేలా వార్డు సచివాలయాలను భాగస్వామ్యం చేయాలి. అదేవిధంగా ఘన వ్యర్థాలను డ్రైనేజీల్లో వేయకుండా అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలి.. నూజివీడు మున్సిపల్ పరిధిలోని డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను వేసే వారిని గుర్తించి అపరాధ రుసుం విధించాలి. ఇలా చేస్తే కొంతవరకైనా డ్రైనేజీల్లో వ్యర్థాలు చేరకుండా అరికట్టవచ్చు.

- రామరాజు, నూజివీడు

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలి



నూజివీడు పట్టణంలో ఇప్పటికీ ఓపెన్ డ్రైనేజీలే కొనసాగుతున్నాయి. వీటి వల్ల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఓపెన్ డ్రైనేజీల స్థానంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు నిర్మిస్తే కొంతవరకైనా సమస్య తీరిపోతుంది. అలాగే పట్టణంలోని డ్రైనేజీ వ్యర్థ జలాలు బయటకు వెళ్లేందుకు కార్యచరణ రూపొందించాలి. దీని కోసం ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించి శాశ్వత పరిష్కారం చూపాలి.

- ఆంజనేయులు, నూజివీడు

పెద్దింట్లమ్మకు ప్రత్యేక పూజలు



కైకలూరు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): కొల్లేటి కోట శ్రీపెద్దింటి అమ్మవారిని భక్తులు పెద్దఎత్తున దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం పలు జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారికి పాలపొం గళ్లను నైవేద్యంగా సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించి భక్తులకు ఉచిత ప్రసాదాన్ని అందజేశారు.

త్యాగరాజస్వామి సన్నిధిలో సుదర్శన హోమం



త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాల్లో హోమ పూజలు

ముదినేపల్లి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా ఆదివారం సింగరాయపాలెంలోని బావాజీమఠం ఆవరణలో ఆదిత్య హృదయ పారాయణ సుద ర్శన హోమం వైభవంగా నిర్వహించారు. స్థానిక నాయీబ్రాహ్మణసంఘం-కళాకారుల ఆధ్వర్యం లో జరుగుతున్న ఈ ఉత్సవాల్లో యాజ్ఞీకుడు ఆచారి రంగనాథాచార్యులు హోమం, అభిషే కాలు, పూజలు నిర్వహించారు. పలువురు దంపతులు హోమ పూజలు జరిపారు. అనం తరం విష్ణు సహస్రనామ పారాయణం నిర్వ హించి పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. టీడీపీ మండల అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, ప్రధాన కార్యదర్శి బొంగు రవికుమార్ పూజలు నిర్వహించగా, నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు వారిని సత్కరించారు.





అభిమానులకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే కామినేని. మట్టగుంటలో హర్షం వ్యక్తం చేస్తున్న నాయకులు

బాలకృష్ణకు పద్మభూషణ్ రావడంపై హర్షం

కైకలూరు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): సినీహీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్ అవార్డు రావడం అభినందనీయ మని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కైకలూరులో బాలకృష్ణ ఫ్యాన్స్ ఆధ్వ ర్యంలో కేక్‌కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మంచి పనులు చేసి సమాజంలో మంచి గుర్తింపు తెచ్చు కుంటే అవార్డులు వాటంతటే అవే వరిస్తాయ న్నారు. ఈ కార్యక్రమంలో నందమూరి అభిమా నులు లక్కింశెట్టి మోహన్, వేగిరెడ్డి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవకుడికి అవార్డు...

చాట్రాయి : నటుడిగా, రాజకీయ నాయకు డిగా, వైద్య రంగంలో తెలుగు ప్రజలకు విశేష సేవలందిస్తున్న నందమూరి బాలకృష్ణకు పద్మ భూషణ్ పురస్కారం రావడం పట్ల ఎన్నారై టీడీపీ నాయకుడు బొట్టు వంశీ, మండలాధ్యక్షురాలు బొట్టు వరలక్ష్మి,తెలుగురైతు జిల్లా ప్రధాన కార్య దర్శి మోరంపూడి శ్రీనివాసరావు, మండల నాయ కుడు బొట్టు లక్ష్మణరావు హర్షం వ్యక్తం చేశారు.

స్వీట్లు పంచుకున్న అభిమానులు...

కలిదిండి : నందమూరి బాలకృష్ణకు పద్మ భూషణ్ అవార్డు లభించడం పట్ల టీడీపీ నాయ కులు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఆది వారం మట్టగుంటలో అగ్నికుల క్షత్రియ కార్పొ రేషన్ డైరెక్టర్, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అంద్రాజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తలకు, అభి మానులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో టీడీపీ నాయకులు అంద్రాజు దుర్గారావు, నాగిడి వీరబ్రహ్మం, బళ్లా రాజు, కోకా తాతయ్య, టి.గోపాలకృష్ణ, ఎన్.రమణ, పరశురాముడు తది తరులు పాల్గొన్నారు.



కైకలూర్లులో జాతీయ నాయకుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్



నూజివీడు ట్రిపుల్ ఐటీలో జెండా ఆవిష్కరణలో ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ అమరేంద్రకుమార్



చాట్రాయి మండల పరిషత్ కార్యాలయంలో జెండా వందన సమర్పణ చేస్తున్న అధికారులు, నాయకులు



ముసునూరు సచివాలయం వద్ద గణతంత్ర వేడుకలు

ఘనంగా గణతంత్ర వేడుకలు

వాడవాడలా జెండా ఆవిష్కరణలు

కైకలూరు/మండవల్లి/కలిదిండి/ముదినేపల్లి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగఫలాలు ప్రతీ ఒక్కరికి అందితేనే నిజమైన స్వాతంత్ర్యమని ఆ ఫలాలను అందరికి అందేలా చేయాల్సిన బాధ్య త అందరిపై ఉందని కైకలూరు సీనియర్ సివిల్ జడ్జి వీవీఎస్ వెంకటలక్ష్మి, జూనియర్ సివిల్ జడ్జి ఎం. శివకిరణ్ అన్నారు. ఆదివారం గణతం త్ర వేడుకల సందర్భంగా కైకలూరు న్యాయ స్థానాల సముదాయాల వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. బార్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో అధ్యక్షుడు వేంపాటి సాయి జాతీయె జెండాను ఎగురవేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఆర్.ఫణీంద్ర జాతీయజెండాను ఆవిష్కరించారు. కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కైకలూరు తాలుకా సెంటర్లోని అంబేడ్కర్ విగ్రహానికి నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ పీరమల్లు నరసింహారావు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. మండవల్లి మండలం మండవల్లి గాంధీ ఆశ్రమంలో ఏవో దివ్యశ్రీ జాతీయ జెండాను ఆవిష్కరించారు. సర్పంచ్ మెండా ఝాన్సీసురేష్‌బాబు, వార్డు సభ్యులు పాల్గొన్నారు. కలిదిండి మండలం కలిదిండి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ వేముల వెంకటేశ్వరరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరిం చారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కొండలరావు జెండా ఎగురవేశారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రామకృష్ణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ముదినేపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో వై.రామకృష్ణ, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ సుభానీ జాతీయ జెండాలను ఎగురవేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద సబ్ రిజిస్ట్రార్ సిహెచ్.రజిత జాతీయ జెండాలను ఎగురవేశారు.

నూజివీడు నియోజకవర్గంలో..

నూజివీడు/నూజివీడు టౌన్/ చాట్రాయి/ ముసునూరు/ ఆగిరిపల్లి, జనవరి 26 (ఆంధ్ర జ్యోతి): నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, నూజివీడు పట్టణ సీఐ కార్యాలయంలో సీఐ శ్రీనివాస్, రూరల్ సీఐ కార్యాలయంలో సీఐ రామకృష్ణ, నూజివీడు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుబ్బా రావు, నూజివీడు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకటరామిరెడ్డి, నూజివీడు కోర్టుహాలు ప్రాంగణంలో 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ, నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఎస్.అమరేంద్రకుమార్, ఎమ్మార్ అప్పారావు కాలేజ్ ఫర్ పీజీ స్టడీస్‌లో కృష్ణా యూనివర్శిటీ ప్రొఫెసర్ ఎంవీ బసవేశ్వరరావు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. నూజివీడు టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గణతంత్ర వేడుక లు నిర్వహించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్క రించారు. టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు. నూజివీడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ పట్టణ కార్యదర్శి పి.నాగరాజు జెండా ఆవిష్కరించారు. నూజివీడు పట్టణ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. చాట్రాయి మండల పరిషత్ కార్యాలయంలో, సచివాలయంలో ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ కార్యాలయంలో డీటీ ఈశ్వరరావు, వీహెచ్‌సీలో డాక్టర్ దుర్గాప్రసాద్, చీపురుగూడెం పాలకేంద్రం వద్ద విజయ డెయిరీ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు జాతీయ పతా కాలు ఆవిష్కరిం చారు. చాట్రాయి మండలం కొత్తగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠ శాలలో 200 మందిపైగా రాజ్యాంగ పరిషత్ సభ్యుల ఫొటోలు ఏర్పాటు చేసి వారికి ఘనంగా నివాళులర్పించారు. జాతీయ నాయకుల వేష ధారణలలో చిన్నారులు అలరించారు. ముసు నూరు మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాజ్‌కు మార్, మండల కార్యాలయంలో ఎంపీడీవో జి.రాణి, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ ఎం.చిరంజీవి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు షకీనా ఇవాంజలి, కరీముల్లా, విద్యాశాఖ కార్యాల యంలో ఎంఈవో బీవీఎస్ సుబ్బారావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. స్వాతంత్ర్య సమర యోధుల చిత్రపటాల వద్ద నివాళులర్పిం చారు. ఆగిరిపల్లి మండల రెవెన్యూ కార్యాలయం వద్ద తహసీల్దార్ పీఎస్‌వీ ప్రసాద్ జెండా ఆవిష్కరిం చారు. అంబేడ్కర్, మహాత్మగాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో ఆనంద్‌బాబు జెండా ఆవిష్కరించారు.



గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ముద్దరబోయిన వెంకటేశ్వరరావు

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణంలోని పెద్ద గాంధీబొమ్మ సెంటర్ వద్ద నూజివీడు త్రివిధ విద్యార్థులు చేసిన ప్రదర్శనలు పలువురిని విశేషంగా ఆకట్టుకున్నాయి. జాతీయ నాయకుల వేషధారణలో విద్యార్థుల ప్రదర్శన, దేశభక్తి గేయాలు, బాలికల నృత్యాలు అలరించాయి. పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నూజివీడులో త్రివిధ విద్యార్థుల ప్రదర్శన



చిన్నారి తల్లికి ఎల్‌వోసీని అందజేస్తున్న మంత్రి

తలసేమియా బాధితురాలికి సాయం

ఆగిరిపల్లి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఈదులగూడెంకు చెందిన షేక్ రఫియా బేగం అనే చిన్నారి తలసేమియా వ్యాధితో బాధపడుతూ ఆంధ్రహాస్పిటల్లో చికిత్స పొందుతోంది. చిన్నారి తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ చిట్నేని విజయ శేషగిరిరావు, టీడీపీ నాయకుడు చిట్నేని శివరామకృష్ణ కలిసి మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే స్పందించి ఎల్‌వోసీ రూ.3,02,515 మంజూరు చేయించి పత్రం అందజేశారు.

మందకృష్ణ మాదిగకు అభినందనలు

ఆగిరిపల్లి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి):ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిష్ఠాత్మక పద్మ పురస్కారాలు ఈసారి ఏడుగురు తెలుగువారికి దక్కడం మనందరికి గర్వకారణమని బీజేపీ అధ్యక్షుడు కొవ్వలి బాబూరావు అన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం అలుపెరుగని పోరాటం చేసిన ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు, దళిత ప్రజా నాయకుడు మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ పురస్కారం లభించడం చాలా సంతోషం కలిగించిందన్నారు. ఈ సందర్భంగా పద్మశ్రీ పురస్కారాలకు ఎంపికైన వారందరికి అభినందనలు తెలిపారు.